విజిట్



జాగునికీకరణ!

కాల్వల ఆధునికీకరణ ఊసేది

- పూడుకుపోయిన కాల్వలు
- ఎక్కడికక్కడ శిథిలమైన లాకులు
- గత ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ
- కూటమిలోనూ అరకొరే నిధులు
- నేటికీ ఆరంభం కాని పనులు
- కాల్వలు కట్టేసి 20 రోజులు
- మరో పది రోజుల్లో నీరు విడుదల
- ఎక్కడి సమస్యలు అక్కడే

కాలువలు కట్టేశారు.. అప్పుడే 20 రోజులైపోయింది.. అయినా కాల్వల ఆధునికీకరణ ఊసేలేదు.. దీంతో ప్రస్తుతం కాలువలు అధ్వానంగా ఉన్నాయి. గతంలో ఏ ప్రభుత్వమైనా ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ ఎం) పేరుతో ప్రతి ఏటా కాలువల క్లోజర్ సమయంలో ఆధునికీకరణ పనులు చేపట్టాలి. వైసీపీ హయాంలో అసలు పట్టించుకోలేదు. 2017 టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రధాన పంట కాల్వలను అభివృద్ధి చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఈసారి మొత్తం పనులపై దృష్టి పెట్టాలని భావించింది. ఈ మేరకు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో 33 నియోజకవర్గాల్లో రూ.68.64 కోట్లతో 1,747 పనులు చేయాలని ప్రతిపాదన పంపారు. రాష్ట్ర కేబినెట్‌లో రూ.35.8 కోట్లతో 877 పనులు మంజూరు చేశారు. కోనసీమ జిల్లా పరిధిలో 452 పనులకు 18.15 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.5 లక్షలు, రూ.10 లక్షలుగా వర్కులు విభజించి కాంట్రాక్టర్లు ఈ పనులు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అయితే వీటిలో కాలువల పూడికతీత, తూడు తొలగింపు, షట్టర్ల మరమ్మతులు వంటి చిన్న పనులు మాత్రమే ఉన్నాయి. - రాజమహేంద్రవరం/అమలాపురం/పి.గన్నవరం-ఆంధ్రజ్యోతి



లాకులు.. కూలిపోతున్నాయి..

మండపేట, మే16(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలో బ్రిటీష్ కాలంలో నిర్మించిన లాకులు శిథిలావస్థకు చేరాయి. మరోపక్క అసంపూర్తిగా మిగిలిన ఇరిగేషన్ భవనాలు, పంట కాల్వలపై వంతెనలు నేటికీ 13 ఏళ్ల నుంచి ఉత్సవ విగ్రహాల్లా దర్శనమిస్తున్నాయి. ఇదిలా ఉండగా పంట కాల్వలు ఆధునికీకరణ, తూడు తొలగింపు పనులు చేసేందుకు రూ.2 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. దాంతో డివిజన్ పరిధిలో తాపేశ్వరం, రామచంద్రపురం, ద్రాక్షారామ, జగన్నాథగిరి ఇరిగేషన్ సెక్షన్ల పరిధి పంట కాల్వల్లో తూడు తొలగింపు, పూడికతీత పనులు చేపట్టాల్సి ఉంది. ఆయా సెక్షన్ల పరిధిలో 16 సాగునీటి సంఘాలు ఉన్నాయి. వాటి ద్వారా ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణలో పనులు చేపట్టనున్నారు.



తుప్పుపట్టిన లాక్‌లు..

కడియం : కడియం కెనాల్‌పై లాకులు తుప్పు పట్టి లీకులు కారుతున్నాయి. కడియంలో కాకినాడ, రామచంద్రపురం డివిజన్లకు సంబంధించిన లాకు ఉన్న 7 తలుపుల్లో 1,4 తలుపులు పూర్తిగా తుప్పు పట్టి రంధ్రాలు ఏర్పడ్డాయి. గేట్ల ఎవరూ పట్టించుకోక పోవడంతో లాక్ తలుపులు తుప్పుపట్టి పాడైపోయాయి.దీంతో నీరు వృథాగా పోతోంది.



చానల్స్ ఉన్నా నీళ్లు రావు

అనపర్తి : అనపర్తి పరిధి సామర్లకోట కాలువలో ఉన్న ఏడు చానల్స్‌లో ఏ ఒక్కటీ సరైన రీతిలో లేక రైతులు సాగునీటికి అష్టకష్టాలు పడుతున్నారు. ప్రధానంగా అనపర్తి ఎర్రకాలువ వంతెన సమీపంలో ఉన్న నెం 3 సైడ్ చానల్ నుంచి మొత్తం 2016 ఎకరాలకు సాగునీరందుతుంది. అయితే సైడ్ వాల్స్ కూలి అవసారానికి సాగు నీరందని పరిస్థితి ఏర్పడింది.కాలువలకు నీరు విడుదల చేసే లోపు చానల్స్‌కు మరమ్మతులు చేయాల్సి ఉంది.



శిథిలమైన ట్రఫ్

మలికిపురం, మే 16(ఆంధ్రజ్యోతి): మలికిపురం నీటి సంఘం పరిధిలోని గుడిమెల్లంక వంతెన వద్ద మోరికాల్వపై ట్రఫ్ శిథిలమై సాగునీరంతా వేపచెట్టు డ్రెయిన్‌లోకి పోతుంది. ఈ ఏడాది వేసవి కాల్వలు క్లోజర్ పిరియడ్‌లో నిధులు మంజూరు చేస్తారని, ట్రఫ్ నిర్మాణం జరుగుతుందని రైతుల కష్టాలు గట్టెక్కుతాయని ఆశించారు. అయితే ఈ ఏడాది కూడా ట్రఫ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు. రూ.50 కోట్లతో ప్రతిపాదనలు పంపారు.



లొల్లలో శిథిలావస్థకు చేరిన లాకులు

లొల్ల లాకులు..శిథిలం

ఆత్రేయపురం : సెంట్రల్ డెల్టా ఆయువు పట్టు లొల్ల లాకులు శిథిలస్థితికి చేరాయి. అఖండ గోదావరి నుంచి బొబ్బర్లంక ప్రధాన కాలువ ద్వారా లొల్లలాకుల వద్ద మూడు కాలువలుగా విడిపోయి 16 మండలాల్లో రెండు లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తుంది. అమలాపురం, ముక్తేశ్వరం, గన్నవరం కాలువల ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరందిస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఆధునికీకరణ పనుల ఊసే లేదు. షట్టర్ల మరమ్మతులకు నిధుల్లేవ్.. కాలువల వద్ద అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు దెబ్బతిన్నాయి. ఈ వేసవిలో ఆధునికీకరణ పనులకు రూ.60 లక్షలు ప్రతిపాదనలు పంపించారు. స్లూయిజ్ మరమ్మతులకు రూ.4.10 లక్షలు నిధులు మంజూరయ్యాయి. లాకుల నిర్వహణకు నిధులివ్వాల్సి ఉంది.



అరకొర పనులతో సరి..

కొత్తపేట : ఈ సారి అరకొర పనులతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కొత్తపేట నియోజకవర్గ పరిధిలో నాలుగు ఇరిగేషన్ సెక్షన్లు ఉండగా కొత్తపేట- ముక్తేశ్వరం కాలువ పరిధిలో వాడపాలెం వద్ద రూ.10 లక్షలతో రిటైనింగ్ వాల్, పలివెల- అమలాపురం కాలువ అవిడి వద్ద రూ.9 లక్షలతో ఒక రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. డ్రెయిన్ల పూడికతీత చేపట్టనున్నారు.



పంట కాల్వలు అధ్వానం

అంబాజీపేట : పంటకాల్వలు అధ్వానంగా మారాయి. ముక్కామల నుంచి పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, కె.పెదపూడి, అవిడి, ఇసుకపూడి, ముక్కామల, గంగలకుర్రులో పంటకాలువలు ఉన్నా యి. ముక్కామల వెస్ట్ కాలువ నుంచి గత కొన్నేళ్ల గా పంట పొలాలకు సాగునీరందక రైతులు ఇబ్బం దులు పడుతున్నారు. మాచవరంలో ఉన్న పంటకాలువ గుర్రపుడెక్కతో మూసుకుపోయింది.



చెత్త..చెత్తగా కాల్వలు

మామిడికుదురు : ప్రధాన పంటకాల్వలన్నీ మురికి కాల్వలను తలపిస్తున్నాయి. పెదపట్నం నుంచి మగటపల్లి వరకు, నగరం నుంచి ఈదరాడ వరకు గల ప్రధాన పంటకాల్వలన్నీ చెత్తతో దర్శనమిస్తున్నాయి. కాల్వల ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడంతో అధ్వానంగా ఉన్నాయి.



ఆధునికీకరణ పనులేవీ..

అయినవిల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి-విలస పరిధిలో 60 వేల ఎకరాల ఆయకట్టు ఉన్నా ఆధునికీకరణ పనులు నేటికీ ఆరంభం కాలేదు. అయినవిల్లి-విలస కాల్వలో పూడికతీతకు 7 కి.మీ రూ.3 లక్షలు, జీసీ బ్యాంక్ కెనాల్ 23 కి.మీ నుంచి 30 కిమీ రూ.5 లక్షలు, 30 కి.మీ నుంచి 39 కి.మీ అయినవిల్లి-కొత్తపేట పరిధిలో రూ.5లక్షల వ్యయంతో పనులను నీటిపారుదల శాఖ నిర్వహించాల్సి ఉండగా నేటికీ పనులు ప్రారంభించలేదు.



ఇలా పోతే ఎలా!

కాలువలు కట్టేశారు.. అంటే ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నుంచి దిగువకు నీరెళ్లకుండా లాకులు వేసేస్తారు.. అయినా కాలువ నిండుగానే కనిపిస్తోంది.. ఎందుకంటే లాకులు లాక్ చేసినా శిథిలావస్థకు చేరడంతో మెల్లమెల్లగా నీళ్లు కారిపోతూనే ఉంటున్నాయి. వృథాగా పోతున్నాయి. గత ఐదేళ్లూ వైసీపీ పాలనలో ధవళేశ్వరం బ్యారేజీ వైపు చూసిన వారే లేరు.. దీంతో లాకులు అధ్వానంగా తయారైపోయాయి. ఈ చిత్రంలోనే చూడండి.. బ్యారేజీ లాకుల నుంచి నీళ్లు ఎలా కారిపోతున్నాయో.. ప్రపంచ బ్యాంక్ సుమారు రూ. 150 కోట్లు ఇవ్వడానికి ముందుకు వచ్చినా, వాటితో టెండర్లు పిలిచి, పనులు చేయించడంలో ప్రభుత్వం ఎందుకు మీన మేషాలు లెక్కిస్తోందని విమర్శలకు గురవుతోంది.



సప్లిమెంటరీ పరీక్షకు 490 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, మే 16(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన పరీక్షలకు 490 మంది గైర్హాజరయ్యారని ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయన్నారు. ప్రతి రోజూ వందల సంఖ్యలో విద్యార్థులు హాజరు కావడంలేదని.వీరిలో ఎక్కువ ఉత్తీర్ణత సాధించినవారుంటారన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు స్కోరింగ్ కోసం పరీక్ష రాస్తారన్నారు. ఎంసెట్ పరీక్ష త్వరలో ఉండడంతో చాలా మంది హాజరుకావడంలేదని పేర్కొన్నారు.



డెంగీ నివారణ దినం ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

డెంగీపై అవగాహన ర్యాలీ

రాజమహేంద్రవరం అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : పరిశీలించండి, శుభ్రం చేయండి, మూతలు పెట్టండి అనే మూడు నినాదాలను థీమ్‌గా తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అన్ని ఆరోగ్యశాఖలు అవగాహన ర్యాలీలు చేపడుతున్నాయని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ డెంగీ డేను పురస్కరించుకుని శుక్రవారం జిల్లాలోని వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులు అవగాహన ర్యాలీ చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం వద్ద ర్యాలీని డీఎంహెచ్‌వో ప్రారంభించి మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభంలో ప్రజలకు దోమలద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రత్యేకంగా డెంగీ పట్ల అందరూ అవగాహన కలిగి ముందుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా కార్యాలయం సిబ్బంది, డిప్యూటీ డెమో ఎన్.సత్యకుమార్, సీహెచ్‌వో శర్మ, ప్రోగ్రాం ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రాజమహేంద్రవరంలో తిరంగా యాత్ర

రాజమహేంద్రవరం సిటీ, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు పిలుపు మేరకు రాజమహేంద్రవరంలో శనివారం నిర్వహించే తిరంగా యాత్రను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులో తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పహల్గాం ఉగ్రవాదుల దాడికి ప్రతిచర్యగా ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి మన సైనిక శక్తిని తెలియజేశామన్నారు. ఈ అఖండ విజయానికి దేశం మొత్తం సెల్యూట్ చేస్తున్నందున మనమంతా సాయుధ దళాలకు సమిష్టిగా కృతజ్ఞతాభినందనలు తెలియజేయాల్సిన అవస రం ఉందన్నారు.ఈ మేరకు శనివారం సాయంత్రం 4గంటలకు పుష్కరాల రేవు నుంచి కోటగుమ్మం సెంటర్ మెయిన్‌రోడ్డు మీదుగా కోటిపల్లి బస్టాండ్ వరకు కూటమి నాయకులు ప్రజలు సుమారు 5 వేల మంది కలిసి జాతీయ జెండాలతో తిరంగయాత్ర చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కలెక్టర్ ప్రశాంతి పాల్గొంటారని పేర్కొన్నారు.

వేసవిని జయిద్దాం : జేసీ

రాజమహేంద్రవరం, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల నినాదంగా 'బీట్ హీట్ (వేసవిని జయిద్దాం)' అని జేసీ ఎస్.చిన్న రాముడు పేర్కొన్నారు. డీఆర్వో టి.సీతారామమూర్తితో కలిసి శుక్రవారం సాయంత్రం సమన్వయ శాఖల అధికారుతో వీడియో కాన్ఫరెన్స్ విధానంలో సమావేశం నిర్వహించారు. వేసవి ఉష్ణోగ్రతల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా రహదారులు, పల్లెలు, ప్రధాన కూడళ్లతో పాటు అవసరమైన అన్ని చోట్లా చల్లని తాగునీరు అందుబాటులో ఉండే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. ఎండ వేడిమికి అస్వస్థతకు గురి కాకుండా ఉండే జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పిల్లలు, వృద్ధుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. పశు పక్ష్యాదుల కోసం నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలన్నారు. డ్వామా ఆధ్వర్యంలో ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 202 నీటి తొట్టెలను నిర్మించడం జరిగిందన్నారు. వాతావరణంలో మార్పుల వల్ల అక్కడక్కడా ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయన్నారు. రెండుమూడు చోట్ల పిడుగులు పడిన సందర్భాల్లో మరణాలు సంభవించడం దురదృష్టకరమన్నారు. వర్షం పడుతున్నప్పుడు, పిడుగులు పడే అవకాశం ఉన్న సమయంలో చెట్ల కింద, కరెంటు స్తంభాల సమీపంలో ఉండడం ప్రమాదకరమన్నారు. ఇటీవల పిడుగుపడి గోపాలపురంలో 4 గేదెలు మృత్యువాతపడిన ఘటనలు ఉన్నాయన్నారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మే నెలలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో నిర్వహిస్తున్న నీరు- మీరును సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో భాగంగా ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేసి మెరుగైన ఫలితాలు సాధించాలని జేసీ స్పష్టం చేశారు.వేసవి కారణంగా ఉపాధి హామీ పనులు సమయానుగుణంగా నిర్వహించాలన్నారు. అధికారులంతా బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు.



గోకవరం, మే16(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ వ్యూహరచనలతో పహల్గాం దాడికి ప్రతీకారం తీర్చుకున్నామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు.ఆపరేషన్ సిందూర్ విజయోత్సవంలో భాగంగా గోకవరంలో శుక్రవారం తిరంగా ర్యాలీ చేశారు. సుమారు 450 అడుగుల జాతీయ జెండాతో పంచాయతీ కార్యాలయం నుంచి దేవీచౌక్ వరకు ప్రధాన రహదారిపై ర్యాలీ కొనసాగింది. భారత్ మాతాకు జై అనే నినాదంతో గ్రామమంతా మార్మోగింది. దేవీచౌక్ వద్ద అమర సైనికుడు మురళీనాయక్‌కు ఘనంగా నివాళులర్పించి మాజీ సైనికులను ఎమ్మెల్యే నెహ్రూ ఘనంగా సన్మానించి మాట్లాడారు. రక్షణ రంగంలో ప్రపంచంలోనే భారతదేశం నాల్గో స్థానంలో ఉందన్నారు. ప్రధాని వ్యూహంలో భాగంగా ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం చెప్పడం జరిగిందన్నారు. దీని వల్ల ప్రపంచ దేశాల్లో భారత్ ఖ్యాతి మరింత పెరిగిందన్నారు. వెలుగు కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ర్యాలీలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొనడం విశేషం.. జనం స్వచ్ఛందంగా ర్యాలీ వెంట వచ్చారు. భారత్ మాతా కీ జై నినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తిపోయింది. ఈ కార్యక్రమంలో మండలంలోని అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి నియంత్రణే మార్గం!



నేడు హైపర్‌టెన్షన్ డే

రక్తపోటు నియంత్రణతోనే మనిషికి ఆరోగ్యం
నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు
జీవనశైలిలో మార్పులే కీలకం

ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలలో అధిక రక్తపోటు ఒకటి. ధమనుల గోడలపై రక్త ప్రసరణ వేగం సాధారణంగా ఉండాల్సిన దానికంటే అధికంగా ఉండటాన్ని వైద్య పరిభాషలో హైపర్‌టెన్షన్ అంటారు. ఇదే హై బ్లడ్ ప్రెజర్ (హైబీపీ)కి కారణమవుతుంది. జీవన శైలి, ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి, ఆందోళన తదితర కారణాలతో వచ్చే బీపీ విషయంలో నిర్లక్ష్యం చేస్తే గుండెపోటు వచ్చి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. చాలా మంది బీపీని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. నేడు వరల్డ్ హైపర్‌టెన్షన్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

(అంబాజీపేట- ఆంధ్రజ్యోతి)

ప్రతి వ్యక్తికి తమదైన జీవనశైలి ఉంటుంది. ఎవరి ఆహారపు అలవాట్లు వారికుంటాయి. దైనందిన జీవితంలో ఆటుపోట్లు ఎవరికైనా ఆటుపోట్లు తప్పవు. ఈ క్రమంలో జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడి.. ఆయా వ్యక్తులపై ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా ఆరోగ్యంపై చూపే ప్రభావం తదనంతర పరిణామాలకు కారణమవుతుంది. హైబీపీ వంటి అనారోగ్య పరిస్థితులకు హేతువవుతుంది. చివరిగా ప్రాణాంతక పరిస్థితులకు దారితీసే గుండెపోటుకూ దారితీస్తుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో లక్షలాది మంది రక్తపోటు(హైబీపీ)తో బాధపడుతున్నట్లుగణాంకాలు చెబుతున్నాయి. ఒక్క డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సుమారు 15 లక్షల మంది జనాభా ఉండగా, సుమారు మూడు లక్షల మంది వరకూ రక్తపోటుతో బాధపడుతున్నట్టు అంచనా. ప్రభుత్వం ఆదేశాల మేరకు కోనసీమ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇప్పటివరకూ 90,225 మంది నమోదుకాగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో సుమారు రెండు లక్షల మందికిపైగా రక్తపోటు నియంత్రించేందుకు మందులు వాడుతున్నట్టు అంచనా. ప్రతి నెల సచివాలయాల్లో 104 సిబ్బంది ద్వారా ఆయా గ్రామాల్లోని కొంతమంది బీపీ చెక్ చేయించుకుని ప్రభుత్వం అందిస్తున్న మందులను వాడుతున్నారు.

అధిక ఒత్తిడితో రక్తపోటు..

మారిన జీవన పరిస్థితుల నేపథ్యంలో ఉద్యోగులు, వ్యాపారస్తులు నిత్యం చేసే పనుల్లో తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ప్రైవేట్ ఉద్యోగులు తమ లక్ష్యాలను సాధించేందుకు అదనంగా కష్టపడుతున్నారు. ఈ క్రమంలో సరైన నిద్రలేకపోవడంతోపాటు పని ఒత్తిడితోనే జీవనం సాగిస్తున్నారు. శారీరక శ్రమ లేకపోవడం, స్థూలకాయం, ఉప్పు ఎక్కువగా తీసుకోవడం, నిద్రలేమి ఇవన్నీ కూడా హైబీపీకి కారణాలుగా మారాయి. అధిక ఉప్పుతో కూడిన కల్తీ ఆహార పదార్థాలు తీసుకోవడం మరో కారణం.

రక్తపోటు లక్షణాలు ఇలా..

అధిక బీపీ ఉన్నవారికి తీవ్రమైన తలనొప్పి వస్తుంది. పనిలో అలసట, వికారం, వాంతులు, తల తిరగడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. అధిక రక్తపోటు ఉండే వారికి కంటిచూపు దెబ్బ తినే ప్రమాదం ఉంది. ఛాతిలో నొప్పి వచ్చి గుండెపోటుకు గురయ్యే అవకాశాలు చాలా ఎక్కువే. కొద్దిమందిలో ముక్కు నుంచి రక్తం కారుతుంది. నిద్రలో అతిగా గురక వస్తే హైబీపీకి కారణంగా చెప్పవచ్చు. రాత్రివేళ తరచూ తలనొప్పి రావడం ఒక లక్షణం.



అంబాజీపేటలో బీపీ చెక్ చేస్తున్న వైద్యుడు శ్రీనివాస్

బీపీని కంట్రోల్ చేసేందుకు..

రోజూ శరీరానికి తగిన విధంగా వ్యాయామం చేయాలి. కొవ్వు పదార్థాలు ఎక్కువగా వినియోగించకూడదు. మద్యం, సిగరెట్ తాగే అలవాట్లు ఉండే మానుకోవాలి. ఆహారంలో ఉప్పు రోజుకి 5 గ్రాములు కన్నా ఎక్కువగా తీసుకోరాదు. అధిక బరువు లేకుండా చూసుకోవాలి. 30 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కనీసం నెలకొకసారి బీపీని చెక్ చేయించుకోవాలి. ము ఖ్యంగా జీవన శైలిలో ఒత్తిడిని అధిగమించే మార్పులు చేసుకుంటూ ముందుకెళ్లాలి.

అప్రమత్తత అవసరం..



అధిక రక్తపోటు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బీపీని నియంత్రణలో ఉంచుకుంటే మనిషి ఆరోగ్యానికి ఇబ్బంది ఉండదు. అలా కాకుండా నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికే ప్రమాదం. సరైన వ్యాయామం, ప్రశాంతమైన జీవన శైలిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి. అదేవిధంగా ఆహారపు అలవాట్ల విషయంలో నియంత్రణ ఉండాలి. అలాగే బీపీ ఉన్న వారు వైద్యులతో తరచు చెక్ చేయించుకోవడం తప్పనిసరి.

- డాక్టర్ వై.బాలసుబ్రహ్మణ్యం, వైద్యాధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బెండమూర్లంక

అందమే పుష్పాలు



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి లోని నల్లావారిపేటలో విశ్రాంత బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి గంటి సత్యనారాయణ పెరట్లో మే పుష్పాలు వికసించాయి. ఇవి చుట్టుపక్కల వారిని విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

ముమ్మిడివరం (ఆంధ్రజ్యోతి)

సర్టిఫికెట్ ధ్రువీకరణ చేయించుకోండి

కార్పొరేషన్ (కాకినాడ), మే 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో 2025-2026 సంవత్సరానికి ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు దగ్గరలోని ఏదైనా ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ లేదా జిల్లా ఉపాధి కార్యాలయం, అమలాపురంలో ఏర్పాటు చేసిన వెరిఫికేషన్ కేంద్రంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆన్‌లైన్ నమోదుపత్రంతో ఈనెల 26న సర్టిఫికేషన్ వెరిఫికేషన్ చేయించుకోవాలని కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు.సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేయించుకోని అభ్యర్థులు కౌన్సిలింగ్‌కు అర్హులుకారని తెలిపారు. 555మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారని వీరిలో 118 దరఖాస్తుదారులు మాత్రమే పరిశీలన చేయించుకున్నారన్నారు. మిగిలిన 437 కూడా దరఖాస్తులు పరిశీలన చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08842348182, 9440408182 నెంబర్లను సంప్రదించాలన్నారు. ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశానికి ఈనెల 24తో గడువు ముగుస్తుందని ప్రిన్సిపాల్ వేణుగోపాలవర్మ పేర్కొన్నారు.

114 ఏళ్ల నాటి వృక్షాలు..

త్వరలో చరిత్రలోకి



- అప్పట్లో కింగ్ జార్జి నాటిన మొక్కలు
- గత వైభవ కమ్మని కావ్యంలోని..
- అపురూపాలు ఒక్కొక్కటిగా చరిత్ర కాగితాల్లోకి

చరిత్రను కాపాడుకోవాల్సిందే.. కాలంలో కలసిపోతే తిరిగి తీసుకురావడం అసాధ్యం. ఈ విషయాన్ని గుర్తెరగని వారు చారిత్రక ఆనవాళ్లను చులకనగా చూస్తుంటారు. ఒక ప్రదేశం గత వైభవానికి చారిత్రక ఆనవాళ్లే ప్రతీక. ఈ రుజువులను భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంటుంది. ఇదంతా ఎందుకంటే.. రాజమహేంద్రవరం వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ప్రదేశం. గ్రామంగా ఆరంభమై ఎన్నో మైలురాళ్లు దాటుకొని, మరెన్నో కలికితురాయిరాళ్లను తన కీర్తి కిరీటంలో ఇముడ్చుకొంది. ఎందరో రాజులు, మరెందరో కవులు, మహానుభావులు కదలాడిన నేల నేటికీ సాంస్కృతిక రాజధానిగా విలసిల్లుతోంది. అందుకే గత వైభవ కీర్తులతో కమ్మని కావ్యమని కీర్తించారో కవి. ఆ కావ్యానికి చారిత్రక ఆనవాళ్లే ఆయువు పట్టు. ఆలాంటివి అభివృద్ధిలో ఒక్కొక్కటిగా కలిసిపోయి కనుమరుగవుతున్నాయి. రాజమహేంద్రవరాన్ని రాజరాజ నరేంద్రులు పాలించాడు. అప్పట్లో పెద్ద పెద్ద ప్రాకారాలతో కోట ఉండేది. ఆ కోటకు సంబంధించిన కందకం పేరుతోనే ప్రస్తుతం కందకం రోడ్డు అని పిలుస్తున్న ప్రాంతం ఉంది. ఆ కందకం అవశేషాన్ని రైల్వే బ్రిడ్జి నిర్మాణం సమయంలో తొలగించారు. ఇప్పుడు మనం కంబాల చెరువు-లాలాచెరువు రోడ్డును సెంట్రల్ జైలు రోడ్డు అంటున్నాం. కానీ అది ఒకప్పుడు గ్రాండ్ ట్రంక్ (జీఎన్‌టీ) రోడ్డు. నేషనల్ హైవేలు.. అసలు రహదారులే సరిగా లేని రోజుల్లో లాలాచెరువు వైపు నుంచి నేరుగా లాంచీల రేవుకు ఈ రహదారి ఉండేది. ఆ రోజుల్లో అంటే పట్టణంగా పరిణతి చెందక ముందు ఈ రహదారే ప్రధాన రవాణా మార్గం. రాజులు, జమిందారులు, బ్రిటిషర్లు.. ఇలా ఎవరు రాజమహేంద్రవరం రావాలన్నా అటు నుంచి గోదావరిని దాటాల్సిందే. అలా వచ్చిన తర్వాత టాంగాలో జీఎన్‌టీ రోడ్డు గుండా వెళ్లేవారు. కానీ జీఎన్‌టీ రోడ్డు పోస్టాఫీసు, వై.జంక్షన్‌లో ఓ రెండేళ్ల కిందట లైటింగ్‌తో ఏర్పాటుచేసిన బోర్డు తప్ప గత వైభవ ఆనవాళ్లేమీ కనిపించవు. ఇప్పుడు మనం చెప్పుకుంటున్న పుష్కరాల రేవు ఒకప్పటి పుష్పగిరి. ఇక్కడ ఉన్న గుట్టకు ఆ పేరు ఉండేది. ఇక్కడే బౌద్ధ చిహ్నాలు కూడా ఉన్నాయి. వాటిని ధ్వంసానికే వదిలేశారు. చివరిగా రికార్డు అయిన సతీసహగమనానికి రాజమహేంద్రవరం కోటిలింగాల ఘాట్ మౌనసాక్షి. దానికి సంబంధించిన సమాధిని పుష్కరఘాట్ సమీపంలోని వాటర్ వర్క్స్ ఎదురుగా చూడొచ్చు. తుప్పలతో నిండిన ఆ సమాధి దుస్థితిని ఒకప్పుడు 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురాగా పునరుద్ధరించారు. ఇలా చెప్పుకుంటూపోతే రాజమహేంద్రవరం చరిత్రకు సంబంధించిన ఎన్నో ఎంతో అపురూపమైన అవశేషాలు, రుజువులు చరిత్ర కాగితాల్లోకి ఎక్కేశాయి. ఇప్పుడు సెంట్రల్ జైలు రోడ్డులోని పచ్చటి మర్రి చెట్లు కూడా త్వరలోనే కనుమరుగు కానున్నాయని తెలుస్తోంది. రోడ్డు వెడల్పు చేయడంలో భాగంగా వీటిని తొలగించే ఆలోచన చేస్తున్నారు. వందల ఏళ్ల కిందట కాదు.. ఓ 20 ఏళ్ల కిందట ఈ రహదారిలో వెళుతుంటే ఆ చెట్లు పచ్చని పరదా పరచినట్టుగా ఉండేవి. ఓ చిట్టడవిని తలపిస్తూ ఎంతో నీడనిచ్చేవి. ఈ చెట్లకు సుమారు 115 ఏళ్ల చరిత్ర ఉంది. ఇప్పటి సెంట్రల్ జైలు ఒకప్పటి ఫ్రెంచి పాలకుల గుర్రపుశాల. తర్వాత కాలక్రమేణా దీనిని బ్రిటిషర్లు జైలుగా మార్చారు. అలా ఇప్పుడు చూస్తున్న రూపు సంతరించుకొంది. గత పుష్కరాలకు మార్పులు చేసే వరకూ ఆనాటి పెద్ద జైలు తలుపు ఉండేది. తర్వాత అదీ కనుమరుగైంది. మనం బ్రిటిషర్ల పాలనలో ఉండే సమయంలో భారతదేశ ఐదో బ్రిటిష్ చక్రవర్తిగా జార్జ్ ఫ్రెడరిక్ ఎర్నెస్ట్ ఆల్బర్ట్(కింగ్ జార్జ్) 1910లో బాధ్యతలు చేపట్టాడు. తర్వాత ఆయన 1911 డిసెంబరు 12న జైలు సందర్శనకు ఇక్కడికి వచ్చాడు. రాకకు గుర్తుగా ఈ చెట్లను నాటారని ఆనాటి శిలాఫలకం ద్వారా తెలుస్తోంది. ఆ శిలాఫలకం గత పుష్కరాల ముందు వరకూ ఉండేదని చెబుతారు. తర్వాత కాలగర్భంలో కలిసిపోయింది. ఈ చెట్లు కూడా కాలగర్భంలో కలిసిపోతే రాజమహేంద్రవరం చారిత్రక సజీవ అవశేషాలు దాదాపుగా కనుమరుగైపోయినట్టే. అదే జరిగితే ఆనాటి వైభవాన్ని పిల్లలకు మాటల్లో చెప్పి పుస్తకాల్లో చూపించడం తప్ప రుజువును కళ్ల ముందుకు తీసుకురావడం అసాధ్యం.



సెంట్రల్ జైల్ రోడ్డులో వందేళ్లకు పైబడిన మహా వృక్షాలు



సెంట్రల్ జైల్లో బ్రిటిష్ భారతదేశపు చక్రవర్తి కింగ్‌జార్జ్ 5 నాటిన వృక్షానికి సంబంధించిన శిలాఫలకం

- రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)

స్త్రీశక్తితో సమాజ పురోగతి

సేవికా సమితి రాష్ట్ర కార్యవాహిక ఉజ్వల.. మహిళ పథ సంచలన ర్యాలీ



రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న మహిళ పథ సంచలన ర్యాలీ

రాజమహేంద్రవరం కల్చరల్, మే 16(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి కుటుంబానికి, దేశానికి స్ఫూర్తిదాయకమని, స్త్రీ శక్తి మేల్కొంటే సమాజం పురోగతి చెందుతుందని సేవికా సమితి రాష్ట్ర కార్యవాహిక ఉజ్వల అన్నారు. హిందూ ధర్మ పరిరక్షణే ప్రధానంగా సేవికా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మహిళ పథ సంచలన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రకాష్‌నగర్ రౌండ్ పార్కు నుంచి మొదలైన ఈ ర్యాలీ వై-జంక్షన్‌లోని అబ్దుల్ కలామ్ విగ్రహం మీదుగా జాంపేటలోని గాంధీ బొమ్మ నుంచి తిరిగి ప్రకాష్‌నగర్‌కు చేరింది. ఈ సందర్భంగా ఉజ్వల మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణే ధ్యేయంగా శక్తివంతమైన సమాజ నిర్మాణ కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో అఖిల భారత సంచాలిక శాంతక్క, ఆంధ్ర ప్రాంత కార్యవాహిక వెంకటభాను, మహిళలు, సమితి కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామోత్సవాలకు కాంస్య రథం వితరణ

రూ.8లక్షల వ్యయంతో సమకూర్చిన దొరబాబు సుమ దంపతులు



కాంస్య రథాన్ని అందజేస్తున్న దొరబాబు సుమ దంపతులు

అనపర్తి, మే 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరు గ్రామంలో వేంచేసియున్న పలు ఆలయాలలో ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవాలు నిర్వహించేందుకు వీలుగా గ్రామానికి చెందిన సత్తి వీరవెంకట సత్యనారాయణ రెడ్డి(దొరబాబు) సుమ దంపతులు రూ.8 లక్షల వ్యయంతో సమకూర్చిన కాంస్య రథాన్ని శుక్రవారం గ్రామంలోని దేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ తన తండ్రి సత్తి సూర్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం తమ కుటుంబ సభ్యులు ఈ రథాన్ని బహూకరించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని నూతన కాంస్య రథంలో ఊరేగించి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో స్వామి వారి దివ్యకల్యాణోత్సవాలు సందర్భంగా నిలుపుదల చేసిన ఆర్జితసేవలు పునః ప్రారంభం అయ్యాయి. దీనిలో భాగంగా శుక్రవారం స్వామి వారి ఆలయ ప్రాంగణంలో చండీ హోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజతో కార్యక్రమం ప్రారంభించారు. అమ్మ వారికి చండీ, సప్తసతి పారాయణాలు, మూలమంత్ర జపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు, ఛైర్మన్ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో ఆర్జితసేవలు పునఃప్రారంభం

శృంగేరీ పీఠాధిపతుల సలహాలతోనే..

అన్నవరం దేవస్థానంలో ఉత్సవాల సమయంలో పలు ఆర్జితసేవలు నిలుపుదల విషయంలో గందరగోళ పరిస్థితులు తలెత్తుతున్నాయి. వైదిక కమిటీ కూడా ఒక్కోసారి ఒక్కో నిర్ణయాన్ని వెళ్లబుచ్చుతున్నారు. ఇప్పటివరకు కల్యాణోత్సవాల సమయంలో వనదుర్గ ఆలయంలో చండీ,ప్రత్యంగిర హోమాలు ఎప్పుడు నిలుపుదల చేయలేదు. ఈ ఏడాది నిలుపుదల చేయగా అవి వివాదాస్పదమయ్యాయి. దీంతో సరైన ప్రణాళికలతో శృంగేరీ పీఠాధిపతుల సలహా తీసుకుని దానిని ప్రామాణికంగా బావించి ప్రతీఏటా వారి సూచనను అమలు చేయాలని ఛైర్మన్ రోహిత్, ఈవో సుబ్బారావు వైదిక కమిటీకి సూచించారు.

పాలమూరు హెల్త్ క్లినిక్‌లో తనిఖీలు

- 'కాలం చెల్లిన మందులు' వార్తలపై స్పందించిన వైద్య ఆరోగ్యశాఖ
- బాధ్యులపై చర్యలు తప్పవు: జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ కోమలి



కాలం చెల్లిన మందులను పరిశీలిస్తున్న డాక్టర్ కోమలి

అనపర్తి, మే 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పొలమూరు గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో కాలం చెల్లిన మందులపై మీడియాలో వచ్చిన కథనాలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ స్పందించింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ కోమలి, డీపీఎంఓ డాక్టర్ శ్రీవల్లి తదితరులు హెల్త్ క్లినిక్‌లో తనిఖీలు నిర్వహించి కాలం చెల్లిన మందులను గుర్తించారు. ఈ సందర్భంగా క్లినిక్‌లో ఉన్న కాలం చెల్లిన మందుల వివరాలను నమోదు చేసుకుని సిబ్బందిని విచారించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోమలి మాట్లాడుతూ మీడియాలో వచ్చిన కథనాలతో డీఎంఅండ్‌హెచ్‌వో ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామని, తనిఖీల్లో కాలం చెల్లిన మందులను గుర్తించామన్నారు. ఎప్పటికప్పుడు సిబ్బందికి సూచనలు చేస్తున్నప్పటికీ కొన్ని చోట్ల బాధ్యతారాహిత్యం కనబడుతోందన్నారు. జిల్లాలో మిగిలిన చోట్ల కూడా పరిస్థితులపై ఆరా తీస్తున్నామని బాధ్యులపై చర్యలు తప్పవని ఆమె అన్నారు. పూర్తి స్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అన్నారు. ఈ తనిఖీల్లో కుతుకులూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వందేమాతరం



ఉగ్రవాదులకు, పాకిస్తాన్‌కు ఆపరేషన్ సిందూర్ ద్వారా గుణపాఠం చెప్పిన భారత త్రివిధ దళాలకు సంఘీభావంగా శుక్రవారం సాయంత్రం కాకినాడ నగరంలో నిర్వహించిన తిరంగ్ ర్యాలీ విజయవంతమైంది. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీ మెయిన్‌రోడ్‌లోని టుటౌన్ సెంటర్ నుంచి బయలుదేరిన ఈ ర్యాలీ బాలాజీ చెరువు సెంటర్ వరకు కొనసాగింది. ర్యాలీలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అతిథులుగా పాల్గొన్నారు.

-కాకినాడ సిటీ

పుష్పాల కనువిందు

అంబాజీపేట, మే 16(ఆంధ్రజ్యోతి): మండు వేసవిలో ఆహ్లాదంగా ఉండే పచ్చని చెట్ల మధ్య పసుపు, ఎరుపు రంగుల పుష్పాలతో చెట్లు కనువిందు చేస్తున్నాయి. అంబాజీపేట మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న ఎర్రటి పువ్వులు, పసుపు రంగు(రేలా పుష్పాలతో ఉన్న చెట్లు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు ఈచెట్ల అందాలను చూడాల్సిందే.





విపత్తులను ఎదుర్కొందాం

కాకినాడలో మాక్ డ్రిల్

ప్రమాద పరిస్థితులను కళ్లకు కట్టినట్టు చూపించిన అధికారులు

కలెక్టరేట్ (కాకినాడ), మే 16 (ఆంధ్రజ్యోతి): అనుకోని విపత్తులు సంభ వించినప్పుడు ఎదుర్కొనేందుకు ఉద్యోగులు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక, ఎస్‌డీఆర్‌ఎఫ్, పోలీసులు, వైద్య-ఆరోగ్య, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు. సహాయక చర్యల్లో భాగంగా మెట్లు, నిచ్చెనల ద్వారా గాయపడిన వారిని తీసుకువచ్చి తాత్కాలిక వైద్య శిబిరంలో ప్రథమ చికిత్స అందించి వెంటనే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీపీఆర్, అత్యవసర వైద్యం అందించడంపై అవగాహన కల్పించారు. కలెక్టరేట్ పై అంతస్తులో అగ్ని ప్రమాదం సంభవించినట్టు చూపించి నిచ్చెన ఆసరాగా భవనం పైకి విపత్తు స్పందన సిబ్బంది చేరుకుని ప్రమాదంలో చిక్కుకున్న వారిని కిందికి తీసుకొచ్చి వైద్య సహాయం అందించేందుకు 108 వాహనాల ద్వారా ఆసుపత్రికి తరలించడం వంటి అంశాలను కళ్లకు కట్టినట్టు చూపించారు. వీటిని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా స్వయంగా పర్యవేక్షించారు. కలెక్టరేట్ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ రూమ్ భవనంలో కొంత భాగం కూలినట్టు చూపించి అందులో చిక్కుకున్న వారిని ఎలా కాపాడాలో వివరించారు. భవనం కూలిపోయిన తర్వాత అందులో ఎంత మంది చిక్కుకున్నారో తెలుసుకునేందుకు కెమెరాలు వినియోగించారు. చిక్కుకున్న వారిని శబ్ధాల ద్వారా గ్రహించి రక్షించేందుకు గోడను కట్టర్ల ద్వారా కట్ చేసి దాని ద్వారా భవనంలోకి ప్రవేశించి లోపల ఉన్నవారిని స్ట్రెచర్లపై తరలించారు. అపస్మారక స్థితిలో ఉన్న వారికి సీపీఆర్ చేసి అంబులెన్సుల్లో ఆసుపత్రికి తరలించారు.


మాక్ డ్రిల్‌ను పర్యవేక్షిస్తున్న జేసీ రాహుల్ మీనా

మాక్ డ్రిల్స్‌తో ప్రజల అప్రమత్తం : జేసీ

ఈ సందర్భంగా జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు, వరదలు వంటి సంక్షోభాలను ఎదుర్కోవడంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు మాక్ డ్రిల్స్ ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, 3వ బెటాలియన్ ఎస్‌డీఆర్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ మోహన్‌రావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ రాజేష్, డీఈవోసీ నోడల్ అధికారి భారతి, సమాచార పౌర సంబంధాల శాఖ డీడీ నాగార్జున, డీపీవో రవికుమార్, కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


కాకినాడలో మాక్ డ్రిల్ దృశ్యాలు

కిలేడీలు అన్నవరంలో దొరికారు!

- బస్సుల్లో ప్రయాణికుల ఆభరణాలు దొంగిలిస్తున్న అత్తాకోడళ్ల అరెస్టు
- 60 గ్రాముల బంగారం, రూ.1.50 లక్షల నగదు స్వాధీనం

అన్నవరం, మే 16 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ కిలేడీలు. దొంగతనానికి నిర్ణయించుకున్నారంటే ఎంతదూరమైనా ప్రయాణిస్తారు. ప్రధానంగా ఆర్టీసీ కాంప్లెక్స్‌లలో ప్రయాణికుల ఆభరణాలు, నగదు తస్కరించడమే లక్ష్యంగా పెట్టుకుని చాకచక్యంగా ప్రయాణికులతో మాటలు కలిపి దృష్టిమరలిచి నగదు, ఆభరణాలు తీసుకుపోతుంటారు. అలాంటి అత్తాకోడళ్లను కాకినాడ జిల్లా అన్నవరంలో పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే విజయవాడ రామవరప్పాడుకు చెందిన నక్కా వెంకటలక్ష్మి (21), నక్కా మంగ (45) అత్తాకోడళ్లు. వీరు రద్దీగా ఉండే బస్సుల వద్ద ప్రయాణికుల ఆభరణాలు, బ్యాగ్‌లలో నగదుపై కన్నేసి వారితో మాటలు కలిపి దృష్టి మరల్చి తస్కరించి వెంటనే దిగిపోతారు. దీంతో వారిపై నిఘాపెట్టిన పోలీసులు అన్నవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అరెస్టు చేసి 60 గ్రాముల బంగారం, రూ.1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్టు ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు తెలిపారు. వీరు అన్నవరం, ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల్లో నిందుతులని తెలిపారు. రిమాండ్‌కు ప్రత్తిపాడు కోర్టుకు తరలించామన్నారు. సమావేశంలో అన్నవరం ఎస్‌ఐ హరిబాబు తదితరులున్నారు.


నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలతో ప్రత్తిపాడు సీఐ

తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలు

- ఇద్దరి అరెస్ట్
- రూ.11లక్షల విలువైన బంగారం, వెండి స్వాధీనం


రాజోలులో వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రాజోలు, మే 16 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాజోలు పోలీసుస్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరినీ రాజోలు పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం రాజోలు సర్కిల్ పోలీసుస్టేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్, ఎస్‌ఐ బి.రాజేష్‌కుమార్ ఈ వివరాలను తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా కోడూరుకు చెందిన బోరాబత్తుల ఆంజనేయులు, తణుకుకు చెందిన వడ్లపాటి విజయ్‌జోషి గత 4 నెలల నుంచి రాజోలు, తాటిపాక మఠం, పొన్నమండ, శివకోడు, ఆత్రేయపురం గ్రామాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. శివకోడు బైపాస్ రోడ్డులో బస్‌స్టేషన్ వద్ద ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.11లక్షల విలువచేసే 112 గ్రాముల బంగారం, రెండు కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మెకానిక్ మృతి

కొవ్వూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని మెకానిక్ మృతి చెందినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు పట్టణానికి చెందిన పత్తిగుళ్ళ నాగరాజు హోండా షోరూంలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 15వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి బయటకు వస్తుండగా కొవ్వూరు డిపోకు చెందిన బస్సు ఏలూరు నుంచి తిరిగి వస్తూ ఢీకొని నాగరాజు పైనుంచి వెళ్లిపోవడంతో తీవ్ర రక్తగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వద్ద లభించిన ఫోన్‌నెంబరు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య దేవి, కుమారుడు సాయిరామ్, కుమార్తె యమున స్వప్నమాధురి ఉన్నారు. అతడికు మారుడు అందించిన ఫిర్యాదుపై ఏఎస్‌ఐ జి.ప్రకాష్ కేసు నమోదుచేసినట్టు సీఐ తెలిపారు.


మృతిచెందిన నాగరాజు


ఫైల్‌ఫొటో

రెండు లారీలు ఢీ

దేవరపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): ఇనుప ఊచలతో నిలిచి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ వేగంగా ఢీకొనడంతో క్యాబిన్‌లోకి ఊచలు దూసుకెళ్లాయి. ఈ ఘటన శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నం శివారులో జరిగింది. రాజమండ్రి వైపు నుంచి దేవరపల్లి వైపు వస్తున్న ఐరన్ ఊచల లారీ రిపేరు రావడంతో నిలిచిపోయింది. రాజమండ్రి వైపు వస్తున్న మరో లారీ ఎదురుగా ఉన్న లారీని ఢీకొనడంతో క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్‌కు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. గాయపడిన క్లీనర్‌ను గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.


క్యాబిన్‌లోకి దూసుకెళ్లిన ఇనుప ఊచలు

పుట్టినరోజు వేడుకకు వచ్చి...

గోదావరిలో యువకుడు గల్లంతు


జగపతిబాబు (ఫైల్)

ఆత్రేయపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): గౌతమి గోదావరి నదిలో ప్రమాదవశాత్తు యువకుడు గల్లంతయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరానికి చెందిన తలపాకుల జగపతిబాబు(జోని) (20) హైదరబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కోనసీమ జిల్లా ఆత్రేయపురం ఉల్లిపేటలో తన మేనమేమ కుమారుడు పుట్టినరోజు వేడుకకు శుక్రవారం వచ్చాడు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 2 గంటల సమయంలో గౌతమి నది తీరానికి బహిర్భూమికి వచ్చి ప్రమాదవశాత్తు కాలుజారి గోదావరిలో గల్లంతయ్యాడు. స్థానికులు గోదావరిలో పడవల ద్వారా గాలింపు చర్యలు చేపట్టినా ఎంతకీ ఆచూకీ లభ్యంకాలేదు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జగపతిబాబు మేనమామ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎస్.రాము తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


మరణించిన శ్రీను

ఆలమూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ ఏటిగట్టు వద్ద అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందాడు. ఆలమూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రావులపాలెం గ్రామానికి చెందిన కుడిపూడి శ్రీను (39) జొన్నాడ గోదావరి ఒడ్డున మృతిచెంది ఉన్నట్టు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. శ్రీను తండ్రి సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఆలమూరు ఏఎస్‌ఐ సూర్యచంద్రరావు తెలిపారు. మృతదేహం వద్ద వివరాలు సేకరించి శవపరీక్ష నిమిత్తం ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

డివైడర్‌ను ఢీకొని గాయాలు


గాయాలపాలైన పవన్

గండేపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామ శివారున బొర్రంపాలెం జంక్షన్ వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదంలో కిర్లంపూడి మండలం శ్రీరంగపట్నంకు చెందిన పవన్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల ప్రకారం.. పవన్ తన స్నేహితుడు ప్రసాద్‌తో కలిసి కొత్త మోటార్‌బైక్ కొనుగోలు చేసేందుకు రాజమండ్రి వెళ్లి కొనుక్కుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. కొత్త వాహనాన్ని పవన్ డ్రైవ్ చేస్తుండగా బొర్రంపాలెం వద్ద బైక్ డివైడర్‌ను ఢీన్నాడు. దీంతో పవన్ తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం జగ్గంపేట ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

బైక్‌ల దొంగ అరెస్టు

జగ్గంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిళ్ల దొంగను జగ్గంపేట పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. గంగవరం మండలం రామదేవపురం గ్రామానికి ఎస్.రామకృష్ణ కొంతకాలంగా మోటారుసైకిళ్ల దొంగతనం చేస్తున్నాడు. అతడిని పోలీసులు అరెస్టు చేసి 5 మోటారు సైకిళ్లు స్వాధీ నం చేసుకున్నారు. అనంతరం పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించింది.

భక్తుల సౌకర్యాల కల్పనలో అలసత్వం ప్రదర్శించొద్దు

- నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై తీవ్రమైన చర్యలు
- అన్నవరం దేవస్థానం ఈవో

అన్నవరం, మే 16 (ఆంధ్రజ్యోతి): సుదూర ప్రాంతాల నుంచి సత్యదేవుడి దర్శనానికి విచ్చేసే భక్తుల సౌకర్యాల కల్పన, వారి సందేహాలను నివృత్తి చేయడంలో సిబ్బంది అలసత్వం ప్రదర్శించవద్దని అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు ఆదేశించారు. శుక్రవారం దేవస్థానం ఏఈవోలు, సూపరింటెండెంట్, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటుచేశారు. ప్రధానంగా గురువారం దేవదాయ కమిషనర్, ప్రిన్స్‌పల్ సెక్రటరీలు సమీక్షలో ప్రధాన దేవాలయాల ఈవోలు పాల్గొనగా వాటి విషయాలను శుక్రవారం ఈవో వివరించారు. సింహాచలం దేవస్థానంలో జరిగిన ఘటన అక్కడ ప్రస్తావనకు వచ్చిందని, కేవలం రూ.2.50 లక్షల పనుల్లో నాణ్యతలేమితో పలువురు ప్రాణాలు కోల్పోయారని ఇది నిర్లక్ష్యంతో జరిగినదని రిపోర్టులో పేర్కొన్నారని, ఈ విషయంలో అన్నవరం దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు ప్రతీ పనిలో స్వీయ పర్యవేక్షణ చేయడంతో పాటు నాణ్యత విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం దేవదాయశాఖ మీద దృష్టిసారించిన నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ ఐవీఆర్‌ఎస్ సర్వేలో అన్నవరం దేవస్థానం ప్రథమస్థానం రావడానికి ప్రతి ఒక్క ఉద్యోగి సమష్టిగా పనిచేయాలని ఈవో సుబ్బారావు సూచించారు.

ఇంటర్ విద్యార్థులకు ఇన్విజిలేటర్ల స్లిప్‌లు

- ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలో వెల్లడి
- చర్యలకు ఆదేశం

అన్నవరం, మే 16 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు చెప్పాల్సిన అధ్యాపకులే విద్యార్థులను పక్కదారి పట్టించారు. వివరాల్లోకి వెళితే కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఇంటర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్నాయి. గురువారం కళాశాలకు వచ్చిన స్క్వాడ్‌ను చూసి సంబంధిత పాఠ్యాంశాన్ని బోధించే ఒక ఇన్విజిలేటర్ అనుమానాస్పదంగా వ్యవహరించడంతో శుక్రవారం ముగ్గురు ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు నేరుగా పరీక్షహాల్‌కు చేరుకోగా ఒక ఇన్విజిలేటర్ చేతిలో స్లిప్‌లు ఉండడం, మరొక ఇన్విజిలేటర్ వారిపై దరుసుగా మాట్లాడడంతో విషయం బయటపడింది. దీంతో వారిద్దరిపై చర్యలకు ఫ్లయింగ్‌స్క్వాడ్ రిఫర్ చేశారు. ముందుగా వారిని రిలీవ్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో శనివారం ఇద్దరి ఇన్విజిలేటర్ల వివరణ తీసుకునేందుకు కాకినాడ రమ్మని, వారిపై దేవస్థానం ఈవో చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియట్ బోర్డు కాకినాడ కన్వీనర్ ఉత్తర్వులు జారీచేశారు.

పిడుగుపాటుకు మత్స్యకారుడి మృతి


లీలాకృష్ణ (ఫైల్)

ఉప్పలగుప్తం, మే 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి పంచాయతీ వాసాలతిప్పకు చెందిన కర్రి లీలాకృష్ణ (39) శుక్రవారం పిడుగుపాటుకు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లీలాకృష్ణ చెరువుల వద్దకు చేపలు వేటాడేందుకు వెళ్లిన సమయంలో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య గంగాభవానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు స్టేషన్ ఇన్‌చార్జి హరనాథ్ తెలిపారు. అమలాపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టంనిర్వహించామన్నారు.

రేగడిపాలెంలో ఐదు పశువులు..

వై.రామవరం, మే 16(ఆంధ్రజ్యోతి): పిడుగు పడి ఐదు పశువులు మృత్యువాత పడిన ఘటన అల్లూరి జిల్లా వై.రామవరం మండలంలో జరిగింది. మండలంలోని కె.యర్రగొండ పంచాయతీ రేగడిపాలెం గ్రామసమీపంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురవగా పొలాల్లో మేస్తున్న పశువులు మామిడిచెట్టు కిందకు చేరగా పిడుగు పడి నాలుగు ఎడ్లు, ఒక ఆవు మృతిచెందాయి. వీటిలో రేగడిపాలెం వెదుళ్ల చంద్రారెడ్డికి చెందిన రెండు, వెదుళ్ల బుల్లబ్బాయిరెడ్డికి చెందిన ఒకటి, వెదుళ్ల లచ్చిరెడ్డికి చెందిన ఒకటి, రాకోట వెంకటరెడ్డికి సంబంధించి ఒక పశువు ఉన్నట్టు కె.యర్రగొండ సర్పంచ్ వెదుళ్ల సత్యనారాయణ పేర్కొన్నారు సుమారు రూ.3లక్షలు నష్టం ఉంటుందని, బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలంటూ సర్పంచ్ అధికారులను కోరారు.


రేగడిపాలెంలో పిడుగుపాటుకు మృతిచెందిన పశువులు

పెళ్లిలో పాటల కోసం కొట్లాట


- డీజే విషయంలో దాడికి దిగిన పెళ్లి కొడుకు, పెళ్లి కూతురు బంధువులు
- 20మందికి గాయాలు
- కేసు నమోదు చేసిన పోలీసులు


దాడిలో గాయపడిన ఇరువర్గాల బంధువులు

పెద్దాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేటలో జరిగిన ఓ వివాహ వేడుకలో పెళ్లి కొడుకు, పెళ్లి కూతురు బంధువులు డీజే సాంగ్స్ కోసం చితకొట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే జి.రాగంపేటకు చెందిన పెళ్లి కుమారుడికి ఐ.పోలవరం మండలం గుత్తుల వేమవరం గ్రామానికి చెందిన పెళ్లి కుమార్తెకు శుక్రవారం గ్రామంలో పెళ్లి వేడుక జరిగింది. అయితే డీజే సాంగ్స్ విషయంలో ముందు ఇరువర్గాల మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగింది. దీంతో ఇరువర్గాల మధ్య గొడవకు దారితీసింది. దీంతో రెండు వర్గాలు ఒకరికొకరు పొట్టుపొట్టుగా కొట్టుకున్నారు. ఈ పరస్పర దాడుల్లో 20మందికి గాయాలయ్యాయి. పెళ్లి బృందం వచ్చిన బస్సు అద్దాలను సైతం ధ్వంసం చేశారు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో ఎస్‌ఐ మౌనిక అక్కడకు చేరుకుని వివరాలను ఆరా తీశారు. దీనిపై ఇరువర్గాల మధ్య కేసు నమోదు చేశారు.

పోశమ్మ గండి వద్ద పెరుగుతున్న గోదావరి

దేవీపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి పోశమ్మ గండి వద్ద నీటి మట్టం పెరుగుతుంది. గత 4 రోజుల నుంచి గోదావరి పరివాహక ముంపు ప్రాంతమైన కొండ మొదలు, తాళ్లూరు నడిపూడి, గొందూరు కచ్చులూరు, మంటూరు, మూలపాడు, అగ్రహారం, దేవీపట్నం, తోయ్యేరు, పూడిపల్లి, పోశమ్మ గండి గ్రామాలకు ఆనుకుని గోదావరి ప్రవహిస్తుంది. దీంతో దండింగ్ వద్ద సీతపల్లి వాగు బ్రిడ్జ్ మునిగిపోవడంతో గండిపై ఉన్న నాలుగు గ్రామాలవారు ఇందుకూరుపేట ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేందుకు రంపచోడవరం నుంచి గోకవరం మీదుగా ఇందుకూరాపేట రావాల్సి వస్తుంది. దీంతో ప్రభుత్వ కార్యాలయానికి వచ్చే ందుకు ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు తెలిపారు. అలాగే పాపికొండల అందాలను తిలకించేదుకు ప్రకృతి ప్రేమికులు అనేక చోట్ల నుంచి వస్తున్నారు.


పోశమ్మ గండి వద్ద గోదావరి ప్రవాహం

సామర్లకోట నుంచి కాకినాడ కలెక్టరేట్ వైపునకు... 21 నుంచి ట్రాఫిక్ మళ్లింపు

గడ్డర్ల ఏర్పాటు నేపథ్యంలో చర్యలు

కలెక్టరేట్ (కాకినాడ), మే 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట నుంచి అచ్చంపేట వరకు నిర్మిస్తున్న భారత్ మాల జాతీయ రహదారి పనుల్లో భాగంగా బ్రిడ్జిలకు గడ్డర్లు ఏర్పాటు నేపథ్యంలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు సామర్లకోట నుంచి కాకినాడ కలెక్టరేట్ వైపునకు వచ్చే కెనాల్ రోడ్డుకు ట్రాఫిక్ మళ్లించినట్టు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. సామర్లకోట రోడ్డు ముత్యాలమ్మ గుడి దగ్గర ఓవర్ బ్రిడ్జి గడ్డర్ లాంచ్ పనుల కారణంగా నాలుగు రోజులు ట్రాఫిక్ నిలుపుదల చేస్తున్నామన్నారు. అచ్చంపేట నుంచి సామర్లకోట వరకు జరుగుతున్న పనుల్లో భాగంగా అచ్చంపేట జంక్షన్‌లో గడ్డర్లు లేపుతున్నందున ఈనెల 27, 28 తేదీల్లో రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు ట్రాఫిక్ మళ్లిస్తామన్నారు. ఈ విషయాన్ని వాహనదారులు గమనించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఓ ప్రకటనలో కోరారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

ప్రమాదకరంగా కడియం-సామర్లకోట రోడ్డు



మత్స్యక్షేత్రం సమీపంలో అంచులు లేని కడియం కెనాల్ రోడ్డు

కడియం, మే 16(ఆంధ్రజ్యోతి): కడియం-సామర్లకోట రోడ్డు ప్రమాదకరంగా మారింది. కడియం ఆర్అండ్‌బీ రోడ్డు గుండా అను నిత్యం రైతులు, పేపరుమిల్లు కార్మికులు ప్రయాణిస్తుంటారు. మత్స్య క్షేత్రం సమీపంలో రోడ్డు అంచులు విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. అటుగా ఏదైనా లారీ, బస్సు వంటి పెద్దవాహనాలు వస్తే ప్రయాణికుడు తప్పించుకునేందుకు అవకాశం లేదు. పొరపాటున మోటారుసైకిల్, సైకిలు వంటివి జారితే పక్కనున్న కాలువలోకి పడిపోయే పరిస్థితి ఇక్కడ నెలకొంది. ఇప్పటికైనా అధికారులు రోడ్డు మరమ్మతులు చేయించి తమకు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

రంగంపేటలో 1116 మట్టి నమూనాల సేకరణ

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు



రంగంపేటలో మట్టి నమూనాలు సేకరిస్తున్న మాధవరావు

రంగంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): రంగంపేట మండలంలో 1285 మట్టి నమూనాలు లక్ష్యంగా ఇవ్వగా 1116 మట్టి నమూనాలు తీసి పరీక్షలకు పంపించామని, వాటి ఫలితాలు అందిన వెంటనే రైతులకు తెలియజేస్తామని జిల్లా వ్యవసాయాధికారి కె.మాధవరావు అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రమైన రంగంపేటలో రైతు సేవ కేంద్రాన్ని పర్యవేక్షించి ప్రస్తుతం జరుగుతున్న అన్నదాత సుఖీభవ, కౌలురైతు కార్డులు, మట్టి నమూనా సేకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతు క్షేత్రాల్లో వ్యవసాయశాఖ ద్వారా సబ్సిడీపై పంపిణీ చేసిన జీలుగ, పిల్లి పెసర, నవధాన్యాలు, వేసిన పొలాలను సందర్శించారు. అనంతరం స్థానిక రైతులు జుజ్జవరపు సుబ్బారావు, బి.వికాస్ గుప్తా పొలాల్లో మట్టి నమూనా సేకరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.శ్రీనివాస్, విస్తరణాధికారి ఎం.వెంకటేష్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.మహేష్, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యమైన ఉద్యోగులే పరిశ్రమకు మూలస్తంభాలు

అస్సాగో ఇథనాల్ పరిశ్రమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరావు

గోకవరం, మే 16(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమైన ఉద్యోగులే పరిశ్రమకు మూలస్తంభాలని అస్సాగో ఇథనాల్ పరిశ్రమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని గుమ్మళ్ళదొడ్డి గ్రామ సమీపంలోని ఇథనాల్ పరిశ్రమ ప్రాంగణంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పరిశ్రమలో విధులు నిర్వర్తిస్తున్న 141 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. శ్రీకర్ ఆసుపత్రికి చెందిన వైద్య నిపుణులు సేవలందించారు. కార్యక్రమంలో పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ వివేక్‌కుమార్ శుక్లా, జీఎం చంద్రశేఖర్, ఏఎస్‌వో భవానీశంకర్, హెచ్ఎస్ఈ మేనేజర్ సూర్యస్వామి పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, మే 16(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు బాలికలు, ఒక వృద్ధుడు అదృశ్యమైనట్టు పోలీసులు తెలిపారు. స్థానిక మెదరపేటకు చెందిన 17 ఏళ్ల బాలిక ఈ నెల 15వ తేదీ నుంచి కనిపించడంలేదని తెలిపారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆ బాలిక తిరిగి ఇంటికి రాకపోవడం, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే రాజమహేంద్రవరం రూరల్ మండలం నామవరం డీబ్లాక్‌కు చెందిన 17ఏళ్ల బాలిక ఈనెల 12వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆమె జాడ తెలియకపోవడంతో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక దానవాయిపేటకు చెందిన మన్యం వీరవెంకట సీతారామారావు అనే 62 ఏళ్ల వృద్ధుడు ఈనెల 15న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో భార్య అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పేదలకు మెరుగైన సేవలందించాలి'



నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ పద్మ

నిడదవోలు, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందాలని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సర్వీసెస్ సమన్వయ కర్త డాక్టర్ పద్మ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (ప్రభుత్వ ఆసుపత్రి)ని సందర్శించారు. ఈ సందర్భంగా ఓపీ, ఆపరేషన్ థియేటర్, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఆమె వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫయాజ్, రవికాంత్, సుష్మరాణి, రెహనా, అబ్బాస్, తదితరులు ఉన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ




క్యాబిన్‌లోకి దూసుకెళ్లిన ఇనుప ఊచలు

దేవరపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఇనుప ఊచల లోడుతో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టిన ఘటన గౌరీపట్నం శివారులో శుక్రవారం జరిగింది. రాజమండ్రి నుంచి దేవరపల్లి వైపు వస్తున్న ఐరెన్ ఊచల లారీ సాంకేతిక లోపం కారణంగా నిలిచిపోయింది. అయితే అదే మార్గంలో రాజమండ్రి వైపు వస్తున్న మరో లారీ ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన క్లీనర్‌ను గోపాలపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఇసుక లారీలకు బరకాలు కప్పడం తప్పనిసరి

బోట్‌మెన్ సొసైటీ ప్రతినిధులతో రెవెన్యూ, పోలీసు అధికారుల అత్యవసర సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహశీల్దార్ మోహనభారతి, ఎస్ఐ రామకృష్ణ

తాళ్లపూడి, మే16 (ఆంధ్రజ్యోతి): మండలంలో గోదావరి గట్టుపై నిత్యం తిరిగే ఇసుక లారీల నుంచి జారి పడుతున్న ఇసుక వల్ల జరిగే ప్రమాదాల నివారణా చర్యలకు శుక్రవారం బోట్‌మెన్ సొసైటీ ప్రతినిధులతో తహశీల్దార్ కార్యాలయంలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహశీల్దార్ మోహన భారతి, ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్య కూడలిలో రోడ్డుపై పేరుకుపోతున్న ఇసుకతో జరుగుతున్న ప్రమాదాల నివారణకు పలు సూచనలు చేశారు. ప్రతి ర్యాంపు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ఇసుక తరలించే వాహనాలపై బరకాలు కప్పడం, రీచ్‌లకు వెళ్లే దారులలో మిర్రర్‌లు ఏర్పాటుచేయడం వంటి చర్యలు తీసుకోవాలని బోట్‌మెన్ సొసైటీ ప్రతినిధులకు సూచించారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో బోట్‌మెన్ సొసైటీ ప్రతినిధులు, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు వెలవెల

- గ్రామ పాలకులు, అధికారుల నిర్వహణ లేమి
- భారీగా పెరిగిన గుర్రపుడెక్క
- ఊరచెరువు గర్భంలో ఆక్రమణలు
- సుమారు రెండెకరాల విస్తీర్ణంలో చెరువు అన్యాక్రాంతం
- పట్టించుకోని పాలక వర్గాలు, అధికార యంత్రాంగం



గుర్రపుడెక్కతో నిండిన దివాన్‌చెరువు ఊరచెరువు

దివాన్‌చెరువు, మే 16(ఆంధ్రజ్యోతి): నిర్వహణ లేకపోవడం, ఆక్రమణలు కారణంగా దివాన్‌చెరువులోని ఊరచెరువు వెలవెలబోతోంది. దీనికి తోడు చెరువులో గుర్రపుడెక్క పెరిగిపోవడంతో చెరువు రూపు కోల్పోయింది. దీనితో తమ ఊరిపేరులోనే తప్ప ఊరిలో కనీసం ఒక్క చెరువు అయినా లేదంటూ పలువురు ఛలోక్తులు విసురుతున్నారు. చెరువును అభివృద్ధి చేసి లీజుకు ఇవ్వడం ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరే అవకాశం ఉన్నప్పటికీ అధికార్లు గాని, పాలకులు గాని ఎందుచేతనో దానిని పట్టించుకోవడం లేదు. దివాన్‌చెరువులో జాతీయ రహదారిని ఆనుకుని పాలచర్ల వెళ్లే రోడ్డులో దాదాపు 12 ఎకరాల విస్తీర్ణంలో ఊరచెరువు ఉంది. అందులో దాదాపు రెండు ఎకరాలు మేర వివిధ నిర్మాణాలతో ఆక్రమణలకు గురైంది. అయితే గతంలో గ్రామ ప్రజలకు, పశువులకు నీటివనరుగా ఉపయోగపడిన ఈ చెరువును గతకొంతకాలంగా పాలకులు ఎందుచేతనో పట్టించుకోవడం మానివేశారు. దీంతో ఈ చెరువు గర్భంలో ఆక్రమణలు పెరిగిపోగా, చెరువు అంతా గుర్రపు డెక్క దట్టంగా పెరిగిపోయింది. దీంతో చెరువు కళ తప్పి నిరుపయోగంగా తయారైంది. గతంలో తమ చిన్నతనంలో ఈ చెరువు వద్ద ప్రత్యేకంగా కాపలాదారులు ఉండేవారని కనీసం కాళ్లు కడుక్కునేందుకు కూడా చెరువులో దిగనిచ్చే వారు కాదని కొంత మంది గ్రామస్థులు తెలిపారు. అనంతరం డ్రైనేజీ నీటిని చెరువులోకి మళ్లించడం, బోర్లు రావడం వంటి కారణాలతో ఈ చెరువు నిర్లక్ష్యానికి గురైందని వాపోయారు. ప్రస్తుతం గ్రామం అభివృద్ధి చెందుతోందని, దీనికి తోడు చాలా మందికి ఆరోగ్యం విషయంలో శ్రద్ధ పెరుగుతోంది. ఈ క్రమంలో చెరువు లో పెరిగిన గుర్రపుడెక్కను తొలగించడంతో బాటు చెరువును ఆధునీకరించి పర్యాటకులను సైతం ఆకర్షించే విధంగా సుందరీకరణ చేయాలని స్థానిక సామాజిక కార్యకర్త సూరారపు డేవిడ్‌రాజు కోరారు. ఈ ఊర చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి, పార్క్ నిర్మించి చెరువులో బోటు షికారు కూడా కల్పిస్తే ఎంతో బాగుంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ప్రజాసమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యం

నగరపాలక సంస్థ శాఖాధిపతులతో సమీక్షలో కమిషనర్ కేతన్ గార్గ్



అధికారులతో సమీక్ష చేస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో తన చాంబర్‌లో అన్ని విభాగాల ప్రధాన అధికారులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ గత వారం రోజులుగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై తీసుకున్న చర్యలకు సంబంధించిన రిపోర్టును సిద్ధం చేయాలన్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీసి రానున్న వర్షాకాలం నేపథ్యంలో పనులు వేగంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా బీట్ ద హీట్ కార్యక్రమంపైన, వడగాల్పుల బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలను ప్రజలందరికీ వివరించాలన్నారు. శనివారం జరిగే తిరంగ్ ర్యాలీలో పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొనేలా అవకాశం ఉన్నందున తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా నగర ప్రజలకు చల్లని తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, సెక్రటరీ జి.శైలజావల్లి, సూపరింటిండెంట్ ఇంజనీర్ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, రెవెన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

ఎంపీడీవోలతో సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

రాజానగరం, మే 16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సూచించారు. రాజానగరం నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించిన కార్యాచరణపై మూడు మండలాలకు చెందిన ఎంపీడీవోలతో ఎమ్మెల్యే తన కార్యాలయంలో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనేక గ్రామాల్లో శ్మశాన వాటికల్లో సరైన సదుపాయాలు లేక దహన సంస్కారాల సమయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వీటిలో త్వరగా చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. అవసరమైన ప్రాంతాల్లో నూతన శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని చెప్పారు. కొత్తగా చేపట్టాల్సిన రోడ్ల నిర్మాణం, ఇప్పటికే పూర్తి చేసిన రోడ్ల ప్రారంభోత్సవాలు తదితర అంశాలపై చర్చించారు. పేదలు, వృద్ధులు, బాటసారులు, రోజు వారి పనులు చేసుకునే వారి ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్‌ను నియోజకవర్గంలో ఏర్పాటు చేసేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో రాజానగరం, కోరుకొండ ఎంపీడీవోలు జేపీ ఝాన్సీ, అశోక్ కుమార్, పంచాయతీరాజ్ శాఖ డీఈ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

స్వయం ఉపాధి కల్పనలో భాగంగా బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్టు రాజానగరం ఎంపీడీవో జేపీ ఝాన్సీ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 17న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఉదయం 10గంటలకు ఈ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తారన్నారు. మండలంలో ఇప్పటికే 164 మంది మహిళలు శిక్షణ పొందేందుకు ముందుకు వచ్చారని, వీరందరికి స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో 90 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. శిక్షణ అనంతరం వారికి ఉచితంగా కుట్టు మిషన్‌ను అందజేస్తామన్నారు. రోజుకు రెండు బ్యాచ్‌లు వంతున శిక్షణ జరుగుతుందని పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో డెంగీ దూరం

- పీహెచ్‌సీ డాక్టర్ రామభాస్కర్
- పలుచోట్ల వైద్య సిబ్బంది ర్యాలీలు



పాలచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాజానగరం, మే 16(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో డెంగీని సమూలంగా పారద్రోలవచ్చని డాక్టర్ గట్టి రామభాస్కర్ అన్నారు. జాతీయ డెంగీ నివారణా దినాన్ని పలు చోట్ల శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజానగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ప్రదర్శన ర్యాలీ చేపట్టారు. ఇంటి పరిసరాల్లో దోమల ఉత్పత్తి కారకాలైన నీటి కుంటల్లో నీరు నిల్వ లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే నీటిని నిల్వ చేసే తొట్టెలు, డబ్బాలపై మూతలు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రామభాస్కర్, సూపర్‌వైజర్ ఎన్‌వీ రమణ, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: పాలచర్లలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బెనడిక్ట్ మాట్లాడుతూ దోమల వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇంటి ముందు మురికి కాలువల్లో నిల్వ ఉండకుండా చూడాలని, సెప్టిక్ ట్యాంక్ గ్యాస్‌పైపులకు జాలీలు అమర్చాలని సూచించారు. డ్రై డేను పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎం.శ్రీధర్ నాయక్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: సీతానగరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఏవీకే చైతన్య, డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సునీల్ మాట్లాడుతూ డెంగీ దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని, వ్యాధి సోకిన తర్వాత నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమవుతుందన్నారు. ప్రజలందరూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. ప్రతి ఒక్కరు నిల్వ నీటిని పరిశీలించడం, శుభ్రం చేయడం, నీటి తొట్టిపై మూత పెట్టడం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వై.సుబ్బారాయుడు, పీహెచ్ఎన్ ఆదిలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ స్వరూపారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సీతానగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'



నల్లజర్ల, మే16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ హారతి అన్నారు. శుక్రవారం దూబచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీలతో స్వచ్ఛఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఆమె మాట్లాడుతూ స్వచ్ఛత, పచ్చదనం పెంపొందించుటకు గ్రీన్ ఎనర్జీపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

కనకదుర్గమ్మకు 1116 మామిడి పండ్లతో అలంకరణ

గోకవరం, మే16(ఆంధ్రజ్యోతి): గోకవరంలోని రాణా సెంటర్ సమీపంలో ఉన్న కనకదుర్గ అమ్మవారిని శుక్రవారం 1,116 మామిడి పండ్లతో ప్రత్యేకంగా అలంకరించి, పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వైశాఖమాసం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారికి అలంకరణ చేసి నివేదన చేసిన మామిడిపండ్లను భక్తులకు ప్రసాదంగా అందజేశారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

జూలై 5న లోక్ అదాలత్



కొవ్వూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జూలై 5వ తేదీన కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్టు కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అను రాధ తెలిపారు. ఇందులో సివిల్, క్రిమినల్, కుటుంబ తగాదాల కేసులు, భార్యాభర్తల భరణం, డొమస్టిక్ వయొలెన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద కేసులు, బ్యాంకు బకాయిలు, ప్రీ లిటిగేషన్, టెలిఫోన్ బకాయిలు, ప్రామీసరీ నోట్ కేసులు రాజీ చేసుకోవచ్చునన్నారు. న్యాయవాదులు, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దారవరం రైల్వేగేటు మూసివేత

చాగల్లు, మే 16(ఆంధ్రజ్యోతి): దారవరం రైల్వేగేటును శుక్రవారం నుంచి మూసివేస్తున్నట్టు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైల్వేగేటు, పట్టాల మరమ్మతుల నిమిత్తం గేటు ఈనెల 25వరకు తెరుచుకోదని చెప్పారు. దారవరం, మల్లవరం, చంద్రవరం, మార్కొండపాడు ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం దివాన్‌చెరువు సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల నిర్వహణ నిమిత్తం శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో రాజమహేంద్రవరం రూరల్ ఈఈ నటరాజన్ తెలిపారు. ఉదయం 7నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు దివాన్‌చెరువు ఫ్రూట్స్ మార్కెట్, సాధుపేట, ఎస్సీ కాలనీ, పాలచర్ల, శ్రీరాంపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం

బిక్కవోలు, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలభద్రపురం గ్రామానికి చెందిన పున్నపు రాంబాబు(39) మూడు రోజులుగా కనబడడం లేదంటూ తండ్రి పున్నపు నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాంబాబుకు పదేళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కావడంతో అప్పటి నుంచి మతి స్థిమితం లేకుండా ఉంటున్నాడు. ఈనెల 12వ తేదీ ఉదయం కాలకృత్యాల కోసం బయటకు వెళ్లి అప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితులు ఇళ్ల వద్ద వెతికినా కనబడకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశానన్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ శుక్రవారం తెలిపారు.

గడ్డి మందు తాగి ఒకరి మృతి

బిక్కవోలు, మే 16(ఆంధ్రజ్యోతి): బలభద్రపురానికి చెందిన కర్రి బాపిరెడ్డి(42) గడ్డి మందు తాగి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్టు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు. బాపిరెడ్డి రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతూ మందులు వాడుతున్నాడు. గురువారం సాయంత్రం గ్రామంలోని పాత రైల్వే స్టేషన్ వద్దకు వెళ్లి గడ్డి మందు తాగగా స్థానికులు విషయాన్ని అతడి తండ్రి వెంకటరెడ్డికి తెలపడంతో ఆయనను వెంటనే ఆటోలో అనపర్తి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా గేదె అడ్డువచ్చి ఆటో తిరగబడటంతో బాపిరెడ్డి ఎడమకాలుకు తీవ్రమైన గాయాలయ్యాయన్నారు. అనపర్తి ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం తెల్లవారుజామున 2గంటలకు చేర్చగా చికిత్స పొందుతూ 3:42గంటలకు మృతి చెందాడు. బాపిరెడ్డి తండ్రి వెంకటరెడ్డి ఫిర్యాదు, ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

సారాతో మహిళ అరెస్టు

రంగంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలం సింగంపల్లిలో ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించి 10 లీటర్ల సారాను స్వాధీనం పరుచుకొని కాకరపల్లి లక్ష్మీదుర్గను అరెస్ట్ చేశామని ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారని ఆయన తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 20 మంది గైర్హాజరు

రంగంపేట, మే 16(ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు శుక్రవారం ఫిజిక్స్ ఎకనామిక్స్ పరీక్షలకు 314 మంది హాజరు కాగా 20 మంది గైర్హాజరయ్యారని పరీక్షల సీఎస్ ఎస్.మాధురి తెలిపారు. ఉదయం మొదటి సంవత్సరం పరీక్షకు 273 మందికి గాను 261 మంది, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షకు 61 మందికి గాను 53 హాజరయ్యారని చెప్పారు.

పోలేరమ్మను దర్శించుకున్న బూరుగుపల్లి శేషారావు



శేషారావును సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

పెరవలి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఖండవల్లిలో పోలేరమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రామంలోని మహిళలు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి చీర, సారె సమర్పించారు. దీనిలో భాగంగా రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు మండల టీడీపీ అధ్యక్షుడు అతికాల రామకృష్ణమ్మ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ భూపతిరాజు రవివర్మ స్వాగతం పలికారు.



రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0 (శుక్రవారం)
కనిష్ఠం : 26.0

జూలై 5న జాతీయ లోక్ అదాలత్ 8

విజిట్



జాగునికీకరణ!

కాల్వల ఆధునికీకరణ ఊసేది

- పూడుకుపోయిన కాల్వలు
- ఎక్కడికక్కడ శిథిలమైన లాకులు
- గత ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ
- కూటమిలోనూ అరకొరే నిధులు
- నేటికీ ఆరంభం కాని పనులు
- కాల్వలు కట్టేసి 20 రోజులు
- మరో పది రోజుల్లో నీరు విడుదల
- ఎక్కడి సమస్యలు అక్కడే

కాలువలు కట్టేశారు.. అప్పుడే 20 రోజులైపోయింది.. అయినా కాల్వల ఆధునికీకరణ ఊసేలేదు.. దీంతో ప్రస్తుతం కాలువలు అధ్వానంగా ఉన్నాయి. గతంలో ఏ ప్రభుత్వమైనా ఆపరేషన్ అండ్ మెయింట్‌నెన్స్ (ఓఅండ్ ఎం) పేరుతో ప్రతి ఏటా కాలువల క్లోజర్ సమయంలో ఆధునికీకరణ పనులు చేపట్టాలి. వైసీపీ హయాంలో అసలు పట్టించుకోలేదు. 2017 టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రధాన పంట కాల్వలను అభివృద్ధి చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఈసారి మొత్తం పనులపై దృష్టి పెట్టాలని భావించింది. ఈ మేరకు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో 33 నియోజకవర్గాల్లో రూ.68.64 కోట్లతో 1,747 పనులు చేయాలని ప్రతిపాదన పంపారు. రాష్ట్ర కేబినెట్‌లో రూ.35.8 కోట్లతో 877 పనులు మంజూరు చేశారు. కోనసీమ జిల్లా పరిధిలో 452 పనులకు 18.15 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.5 లక్షలు, రూ.10 లక్షలుగా వర్కులు విభజించి కాంట్రాక్టర్లు ఈ పనులు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అయితే వీటిలో కాలువల పూడికతీత, తూడు తొలగింపు, షట్టర్ల మరమ్మతులు వంటి చిన్న పనులు మాత్రమే ఉన్నాయి. - రాజమహేంద్రవరం/అమలాపురం/పి.గన్నవరం-ఆంధ్రజ్యోతి



లాకులు.. కూలిపోతున్నాయి..

మండపేట, మే16(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలో బ్రిటీష్ కాలంలో నిర్మించిన లాకులు శిథిలావస్థకు చేరాయి. మరోపక్క అసంపూర్తిగా మిగిలిన ఇరిగేషన్ భవనాలు, పంట కాల్వలపై వంతెనలు నేటికీ 13 ఏళ్ల నుంచి ఉత్సవ విగ్రహాల్లా దర్శనమిస్తున్నాయి. ఇదిలా ఉండగా పంట కాల్వలు ఆధునికీకరణ, తూడు తొలగింపు పనులు చేసేందుకు రూ.2 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. దాంతో డివిజన్ పరిధిలో తాపేశ్వరం, రామచంద్రపురం, ద్రాక్షారామ, జగన్నాథగిరి ఇరిగేషన్ సెక్షన్ల పరిధి పంట కాల్వల్లో తూడు తొలగింపు, పూడికతీత పనులు చేపట్టాల్సి ఉంది. ఆయా సెక్షన్ల పరిధిలో 16 సాగునీటి సంఘాలు ఉన్నాయి. వాటి ద్వారా ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణలో పనులు చేపట్టనున్నారు.



తుప్పుపట్టిన లాక్‌లు..

కడియం : కడియం కెనాల్‌పై లాకులు తుప్పు పట్టి లీకులు కారుతున్నాయి. కడియంలో కాకినాడ, రామచంద్రపురం డివిజన్లకు సంబంధించిన లాకు ఉన్న 7 తలుపుల్లో 1,4 తలుపులు పూర్తిగా తుప్పు పట్టి రంధ్రాలు ఏర్పడ్డాయి. గేట్ల ఎవరూ పట్టించుకోక పోవడంతో లాక్ తలుపులు తుప్పుపట్టి పాడైపోయాయి.దీంతో నీరు వృథాగా పోతోంది.



చానల్స్ ఉన్నా నీళ్లు రావు

అనపర్తి : అనపర్తి పరిధి సామర్లకోట కాలువలో ఉన్న ఏడు చానల్స్‌లో ఏ ఒక్కటీ సరైన రీతిలో లేక రైతులు సాగునీటికి అష్టకష్టాలు పడుతున్నారు. ప్రధానంగా అనపర్తి ఎర్రకాలువ వంతెన సమీపంలో ఉన్న నెం 3 సైడ్ చానల్ నుంచి మొత్తం 2016 ఎకరాలకు సాగునీరందుతుంది. అయితే సైడ్ వాల్స్ కూలి అవసారానికి సాగు నీరందని పరిస్థితి ఏర్పడింది.కాలువలకు నీరు విడుదల చేసే లోపు చానల్స్‌కు మరమ్మతులు చేయాల్సి ఉంది.



శిథిలమైన ట్రఫ్

మలికిపురం, మే 16(ఆంధ్రజ్యోతి): మలికిపురం నీటి సంఘం పరిధిలోని గుడిమెల్లంక వంతెన వద్ద మోరికాల్వపై ట్రఫ్ శిథిలమై సాగునీరంతా వేపచెట్టు డ్రెయిన్‌లోకి పోతుంది. ఈ ఏడాది వేసవి కాల్వలు క్లోజర్ పిరియడ్‌లో నిధులు మంజూరు చేస్తారని, ట్రఫ్ నిర్మాణం జరుగుతుందని రైతుల కష్టాలు గట్టెక్కుతాయని ఆశించారు. అయితే ఈ ఏడాది కూడా ట్రఫ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు. రూ.50 కోట్లతో ప్రతిపాదనలు పంపారు.



అరకొర పనులతో సరి..

కొత్తపేట : ఈ సారి అరకొర పనులతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కొత్తపేట నియోజకవర్గ పరిధిలో నాలుగు ఇరిగేషన్ సెక్షన్లు ఉండగా కొత్తపేట- ముక్తేశ్వరం కాలువ పరిధిలో వాడపాలెం వద్ద రూ.10 లక్షలతో రిటైనింగ్ వాల్, పలివెల- అమలాపురం కాలువ అవిడి వద్ద రూ.9 లక్షలతో ఒక రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. డ్రెయిన్ల పూడికతీత చేపట్టనున్నారు.



పంట కాల్వలు అధ్వానం

అంబాజీపేట : పంటకాల్వలు ఆధ్వానంగా మారాయి. ముక్కామల నుంచి పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, కె.పెదపూడి, అవిడి, ఇసుకపూడి, ముక్కామల, గంగలకుర్రులో పంటకాలువలు ఉన్నా యి. ముక్కామల వెస్ట్ కాలువ నుంచి గత కొన్నేళ్ల గా పంట పొలాలకు సాగునీరందక రైతులు ఇబ్బం దులు పడుతున్నారు. మాచవరంలో ఉన్న పంటకాలువ గుర్రపుడెక్కతో మూసుకుపోయింది.



చెత్త..చెత్తగా కాల్వలు

మామిడికుదురు : ప్రధాన పంటకాల్వలన్నీ మురికి కాల్వలను తలపిస్తున్నాయి. పెదపట్నం నుంచి మగటపల్లి వరకు, నగరం నుంచి ఈదరాడ వరకు గల ప్రధాన పంటకాల్వలన్నీ చెత్తతో దర్శనమిస్తున్నాయి. కాల్వల ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడంతో అధ్వానంగా ఉన్నాయి.



ఆధునికీకరణ పనులేవీ..

అయినవిల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి-విలస పరిధిలో 60 వేల ఎకరాల ఆయకట్టు ఉన్నా ఆధునికీకరణ పనులు నేటికీ ఆరంభం కాలేదు. అయినవిల్లి-విలస కాల్వలో పూడికతీతకు 7 కి.మీ రూ.3 లక్షలు, జీసీ బ్యాంక్ కెనాల్ 23 కి.మీ నుంచి 30 కిమీ రూ.5 లక్షలు, 30 కి.మీ నుంచి 39 కి.మీ అయినవిల్లి-కొత్తపేట పరిధిలో రూ.5లక్షల వ్యయంతో పనులను నీటిపారుదల శాఖ నిర్వహించాల్సి ఉండగా నేటికీ పనులు ప్రారంభించలేదు.



లొల్ల లాకులు..శిథిలం

ఆత్రేయపురం : సెంట్రల్ డెల్టా ఆయువు పట్టు లొల్ల లాకులు శిథిలస్థితికి చేరాయి. అఖండ గోదావరి నుంచి బొబ్బర్లంక ప్రధాన కాలువ ద్వారా లొల్లలాకుల వద్ద మూడు కాలువలుగా విడిపోయి 16 మండలాల్లో రెండు లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తుంది. అమలాపురం, ముక్తేశ్వరం, గన్నవరం కాలువల ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరందిస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఆధునికీకరణ పనుల ఊసే లేదు. షట్టర్ల మరమ్మతులకు నిధుల్లేవ్.. కాలువల వద్ద అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు దెబ్బతిన్నాయి. ఈ వేసవిలో ఆధునికీకరణ పనులకు రూ.60 లక్షలు ప్రతిపాదనలు పంపించారు. స్లూయిజ్ మరమ్మతులకు రూ.4.10 లక్షలు నిధులు మంజూరయ్యాయి. లాకుల నిర్వహణకు నిధులివ్వాల్సి ఉంది.

లొల్లలో శిథిలావస్థకు చేరిన లాకులు



ఇలా పోతే ఎలా!

కాలువలు కట్టేశారు.. అంటే ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నుంచి దిగువకు నీరెళ్లకుండా లాకులు వేసేస్తారు.. అయినా కాలువ నిండుగానే కనిపిస్తోంది.. ఎందుకంటే లాకులు లాక్ చేసినా శిథిలావస్థకు చేరడంతో మెల్లమెల్లగా నీళ్లు కారిపోతూనే ఉంటున్నాయి. వృథాగా పోతున్నాయి. గత ఐదేళ్లూ వైసీపీ పాలనలో ధవళేశ్వరం బ్యారేజీ వైపు చూసిన వారే లేరు.. దీంతో లాకులు అధ్వానంగా తయారైపోయాయి. ఈ చిత్రంలోనే చూడండి.. బ్యారేజీ లాకుల నుంచి నీళ్లు ఎలా కారిపోతున్నాయో.. ప్రపంచ బ్యాంక్ సుమారు రూ. 150 కోట్లు ఇవ్వడానికి ముందుకు వచ్చినా, వాటితో టెండర్లు పిలిచి, పనులు చేయించడంలో ప్రభుత్వం ఎందుకు మీన మేషాలు లెక్కిస్తోందని విమర్శలకు గురవుతోంది.



సప్లిమెంటరీ పరీక్షకు 490 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, మే 16(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన పరీక్షలకు 490 మంది గైర్హాజరయ్యారని ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయన్నారు. ప్రతి రోజూ వందల సంఖ్యలో విద్యార్థులు హాజరు కావడంలేదని..వీరిలో ఎక్కువ ఉత్తీర్ణత సాధించినవారుంటారన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు స్కోరింగ్ కోసం పరీక్ష రాస్తారన్నారు. ఎంసెట్ పరీక్ష త్వరలో ఉండడంతో చాలా మంది హాజరుకావడంలేదని పేర్కొన్నారు.



డెంగీ నివారణ దినం ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

డెంగీపై అవగాహన ర్యాలీ

రాజమహేంద్రవరం అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : పరిశీలించండి, శుభ్రం చేయండి, మూతలు పెట్టండి అనే మూడు నినాదాలను థీమ్‌గా తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అన్ని ఆరోగ్యశాఖలు అవగాహన ర్యాలీలు చేపడుతున్నాయని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ డెంగీ డేను పురస్కరించుకుని శుక్రవారం జిల్లాలోని వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులు అవగాహన ర్యాలీ చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం వద్ద ర్యాలీని డీఎంహెచ్‌వో ప్రారంభించి మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభంలో ప్రజలకు దోమలద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రత్యేకంగా డెంగీ పట్ల అందరూ అవగాహన కలిగి ముందుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా కార్యాలయం సిబ్బంది, డిప్యూటీ డెమో ఎన్.సత్యకుమార్, సీహెచ్‌వో శర్మ, ప్రోగ్రాం ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రాజమహేంద్రవరంలో తిరంగా యాత్ర

రాజమహేంద్రవరం సిటీ, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు పిలుపు మేరకు రాజమహేంద్రవరంలో శనివారం నిర్వహించే తిరంగా యాత్రను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులో తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పహల్గాం ఉగ్రవాదుల దాడికి ప్రతిచర్యగా ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి మన సైనిక శక్తిని తెలియజేశామన్నారు. ఈ అఖండ విజయానికి దేశం మొత్తం సెల్యూట్ చేస్తున్నందున మనమంతా సాయుధ దళాలకు సమిష్టిగా కృతజ్ఞతాభినందనలు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ మేరకు శనివారం సాయంత్రం 4గంటలకు పుష్కరాల రేవు నుంచి కోటగుమ్మం సెంటర్ మెయిన్‌రోడ్డు మీదుగా కోటిపల్లి బస్టాండ్ వరకు కూటమి నాయకులు ప్రజలు సుమారు 5 వేల మంది కలిసి జాతీయ జెండాలతో తిరంగయాత్ర చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కలెక్టర్ ప్రశాంతి పాల్గొంటారని పేర్కొన్నారు.

వేసవిని జయిద్దాం : జేసీ

రాజమహేంద్రవరం, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల నినాదంగా 'బీట్ హిట్ (వేసవిని జయిద్ధాం)' అని జేసీ ఎస్.చిన్న రాముడు పేర్కొన్నారు. డీఆర్వో టి.సీతారామమూర్తితో కలిసి శుక్రవారం సాయంత్రం సమన్వయ శాఖల అధికారుతో వీడియో కాన్ఫరెన్స్ విధానంలో సమావేశం నిర్వహించారు. వేసవి ఉష్ణోగ్రతల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా రహదారులు, పల్లెలు, ప్రధాన కూడళ్లతో పాటు అవసరమైన అన్ని చోట్లా చల్లని తాగునీరు అందుబాటులో ఉండే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. ఎండ వేడిమికి అస్వస్థతకు గురి కాకుండా ఉండే జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పిల్లలు, వృద్ధుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. పశు పక్ష్యాదుల కోసం నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలన్నారు. డ్వామా ఆధ్వర్యంలో ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 202 నీటి తొట్టెలను నిర్మించడం జరిగిందన్నారు. వాతావరణంలో మార్పుల వల్ల అక్కడక్కడా ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయన్నారు. రెండుమూడు చోట్ల పిడుగులు పడిన సందర్భాల్లో మరణాలు సంభవించడం దురదృష్టకరమన్నారు. వర్షం పడుతున్నప్పుడు, పిడుగులు పడే అవకాశం ఉన్న సమయంలో చెట్ల కింద, కరెంటు స్తంభాల సమీపంలో ఉండడం ప్రమాదకరమన్నారు. ఇటీవల పిడుగుపడి గోపాలపురంలో 4 గేదెలు మృత్యు వాతపడిన ఘటనలు ఉన్నాయన్నారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మే నెలలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో నిర్వహిస్తున్న నీరు- మీరును సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో భాగంగా ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేసి మెరుగైన ఫలితాలు సాధించాలని జేసీ స్పష్టం చేశారు.వేసవి కారణంగా ఉపాధి హామీ పనులు సమయానుగుణంగా నిర్వహించాలన్నారు. అధికారులంతా బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు.



విజయహో..

గోకవరం, మే16(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ వ్యూహరచనలతో పహల్గాం దాడికి ప్రతీకారం తీర్చుకున్నామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు.ఆపరేషన్ సిందూర్ విజయోత్సవంలో భాగంగా గోకవరంలో శుక్రవారం తిరంగా ర్యాలీ చేశారు. సుమారు 450 అడుగుల జాతీయ జెండాతో పంచాయతీ కార్యాలయం నుంచి దేవీచౌక్ వరకు ప్రధాన రహదారిపై ర్యాలీ కొనసాగింది. భారత్ మాతాకు జై అనే నినాదంతో గ్రామమంతా మార్మోగింది. దేవీచౌక్ వద్ద అమర సైనికుడు మురళీనాయక్‌కు ఘనంగా నివాళులర్పించి మాజీ సైనికులను ఎమ్మెల్యే నెహ్రూ ఘనంగా సన్మానించి మాట్లాడారు. రక్షణ రంగంలో ప్రపంచంలోనే భారతదేశం నాల్గో స్థానంలో ఉందన్నారు. ప్రధాని వ్యూహంలో భాగంగా ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం చెప్పడం జరిగిందన్నారు. దీని వల్ల ప్రపంచ దేశాల్లో భారత్ ఖ్యాతి మరింత పెరిగిందన్నారు. వెలుగు కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ర్యాలీలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొనడం విశేషం.. జనం స్వచ్ఛందంగా ర్యాలీ వెంట వచ్చారు. భారత్ మాతా కీ జై నినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తిపోయింది. ఈ కార్యక్రమంలో మండలంలోని అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలకు రాజ్యాంగ హక్కులు అందేలా కృషి

• రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్



జవహర్‌ను సత్కరిస్తున్న లిడ్ క్యాప్ చైర్మన్ మాణిక్యాలరావు

కొవ్వూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీలకు అన్నిరకాల రాజ్యాంగ హక్కులు అందేలా కృషి చేస్తానని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ అన్నారు. శుక్రవారం కొవ్వూరులో లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివక్ష లేని సమాజం కోసం, దళితుల ఐక్యత కోసం సీఎం చంద్రబాబు మాజీమంత్రి జవహర్‌ను నియమించడం జరిగిందన్నారు. జవహర్ మాట్లాడుతూ ఎస్సీ కులాలైన మాల, మాదిగ, రెల్లి కులాల వారిని ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో వేగి చిన్నా, పసలపూడి బోసు, బూరుగుపల్లి రాఘవులు, కోడూరి ప్రసాద్ పాల్గొన్నారు.

దేవరపల్లి: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కేఎస్ జవహర్ శుక్రవారం నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో మేరీమాతకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్ కార్యాలయంలో ఆయన్ని సన్మానించారు. గౌరీపట్నం టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోఠారు ధృవకాంత్, బీజేపీ నేతలు గుత్తికొండ శ్రీనివాసు, చిర్రా కృష్ణా, సురేశ్, శంకర్, ఆర్. అబ్బులు, భాస్కర్, కుమార్, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.



రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను సన్మానిస్తున్న నిర్మలగిరి పుణ్యక్షేత్రం డైరెక్టర్ జాన్‌పీటర్

బోట్‌మెన్ సొసైటీ ప్రతినిధులతో అత్యవసర సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహశీల్దార్ మోహనభారతి, ఎస్ఐ రామకృష్ణ

తాళ్లపూడి, మే16 (ఆంధ్రజ్యోతి): మండలంలో గోదావరి గట్టుపై నిత్యం తిరిగే ఇసుక లారీల నుంచి జారి పడుతున్న ఇసుక వల్ల జరిగే ప్రమాదాల నివారణా చర్యలకు శుక్రవారం బోట్‌మెన్ సొసైటీ ప్రతినిధులతో తహశీల్దార్ కార్యాలయంలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహశీల్దార్ మోహన భారతి, ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్య కూడలిలో రోడ్డుపై పేరుకుపోతున్న ఇసుకతో జరుగుతున్న ప్రమాదాల నివారణకు పలు సూచనలు చేశారు. ప్రతిర్యాంపు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ఇసుక తరలించే వాహనాలపై బరకాలు కప్పడం, రీచ్‌లకు వెళ్లే దారులలో మిర్రర్‌లు ఏర్పాటుచేయడం వంటి చర్యలు తీసుకోవాలని బోట్‌మెన్ సొసైటీ ప్రతినిధులకు సూచించారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో బోట్‌మెన్ సొసైటీ ప్రతినిధులు, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'



దూబచర్లలో అంగన్‌వాడీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

నల్లజర్ల, మే16 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హారతి అన్నారు. శుక్రవారం దూబచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీల చేత స్వచ్ఛఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఆమె మాట్లాడుతూ స్వచ్ఛత, పచ్చదనం పెంపొందించుటకు గ్రీన్ ఎనర్జీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మంగరాణి, దేవకి, విమల, రత్నకుమారి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): గౌరీపట్నం గ్రామశివారు కొండగూడెం విద్యుత్ వినియోగదారులకు దేచర్ల సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గౌరీపట్నం ఫీడర్‌లో వర్క్ నిమిత్తం శనివారం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్‌సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు.

రోడ్లపై చెట్ల కొమ్మలు తొలగించరూ!

• భయాందోళనలో వాహనచోదకులు



నిడదవోలు - నరసాపురం రోడ్డులో పడి ఉన్న కొమ్మలు

పెరవలి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వీచిన ఈదురుగాలులకు నిడదవోలు - నరసాపురం రోడ్డుపై చెట్లకొమ్మలు ఎక్కడికక్కడ విరిగిపడ్డాయి. నిత్యం ఈ మార్గం గుండా వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే విరిగిపడిన కొమ్మలు అక్కడే వదిలి వేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. కానూరు నుంచి కాపవరం వరకు ప్రతి చెట్టుకు ఉన్న చిన్న, పెద్ద కొమ్మలు విరిగిపడ్డాయి. కొన్నిచోట్ల స్థానికులే వాటిని తొలగించినప్పటికీ, మరికొన్ని చోట్ల రోడ్డు మార్జిన్‌లో అలాగే పడి ఉన్నాయి. రాత్రి సమయంలో ఆటో, కార్లు రోడ్డు మార్జిన్ వెంబడి వెళ్లే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అలాగే పలుచోట్ల సగం విరిగిన కొమ్మలు చెట్లకు వేలాడుతూ కనిపిస్తుండడంతో గాలికి ఊగి కింద పడే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా వీటిని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

• కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత



పరిశ్రమల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత అన్నారు. శుక్రవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో లోకల్ క్రైసస్ గ్రూపు సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పరిశ్రమల యజమానులు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి ఖచ్చితంగా భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రమాదకర వ్యర్థాలు విడుదలచేసే పరిశ్రమలను నెల రోజులు, మూడు నెలలు, ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించాలన్నారు. పరిశ్రమలలో ఉద్యోగులు, కార్మికుల భద్రతకు ప్రతి మూడు నెలలకు ఒకసారి శిక్షణ తరగతులు, మాక్‌డ్రిల్ అవసరమన్నారు. జిల్లా స్థాయిలో ఏడు శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కమిటీ పరిశ్రమలు ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో తనిఖీ నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో కర్మాగారాల తనిఖీ అధికారి జి. స్వాతి, అగ్నిమాపకశాఖ ఇన్‌చార్జి జిల్లా అధికారి పి.శ్రీనివాస్, ఆంధ్రా సుగర్స్ కొవ్వూరు, సగ్గొండ, రాగూర్ లేబొరేటరీస్, భాగ్యనగర్ క్లోరైడ్, త్రివేణి గ్లాస్, విజన్ డ్రగ్స్ ఫ్యాక్టరీల ఉద్యోగులు పాల్గొన్నారు. అంతకుముందు పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాలను ఆర్డీవో తనిఖీ చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పిల్లలకు అందజేస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. వేసవి ఎండలు అధికంగా ఉన్నందున పిల్లల పట్ల తగిన జాగ్రతలు తీసుకోవాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు.

రైతన్నకు తప్పని కష్టాలు

పెరవలి, మే 16(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి ధాన్యం పండిస్తున్న రైతన్నకు కష్టాలు తప్పడం లేదు. దళారీలు, మిల్లర్ల బారిన పడకుండా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తున్నప్పటికీ టార్గెట్లకు మించి ఎక్కువ కొనుగోలు చేశామనే ఉద్దేశంతో కొనుగోలును నిలిపి వేశారు. అయినప్పటికీ స్పందించిన ప్రభుత్వం మళ్లీ కొత్త టార్గెట్‌లు విధించి కొనుగోలు చేయాలని మిల్లర్లను ఆదేశించింది. మండలంలో మొత్తం 8 వేల ఎకరాల్లో వరి పండించగా, ఇప్పటి వరకు 25 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ఇంకా మూడు వేల టన్నులు కొనుగోలు చేయాల్సి ఉంది. దీంతో తమ ధాన్యం ఎప్పటికీ చేరతాయోనని ఎదురుచూస్తున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ : ఎమ్మెల్యే



గ్రీవెన్స్‌లో వినతిపత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికే ప్రతివారం గ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారయుడు, సూరపనేని చిన్ని, వేమగిరి వెంకట్రావు, జనసేన నాయకులు సుంకర సత్తిబాబు, ఉప్పులూరి చిరంజీవి, పి. శివ, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మను దర్శించుకున్న శేషారావు



శేషారావును సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

పెరవలి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఖండవల్లిలో పోలేరమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రామంలోని మహిళలు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి చీర, సారె సమర్పించారు. దీనిలో భాగంగా రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు మండల టీడీపీ అధ్యక్షుడు అతికాల రామకృష్ణమ్మ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ భూపతిరాజు రవివర్మ స్వాగతం పలికారు.

అరటి తోటలకు నష్టపరిహారం అందజేయాలి



తాడిపర్రులో నేలమట్టమైన అరటితోట

ఉండ్రాజవరం, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల రెండుసార్లు ఈదురుగాలులు వీయడం వల్ల అరటితోటలకు నష్టం వాటిల్లింది. దీంతో రాష్ట్రప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. వెలగదుర్రు, తాడిపర్రు, చివటం, మోర్త, ఉండ్రాజవరం, తదితర గ్రామాల్లో సుమారు 40 ఎకరాల్లో ఐదు వేలకు పైగా అరటి చెట్లు నేలకూలాయి. నష్టం రూ. లక్షల్లో ఉంటుందని తాడిపర్రు, వెలగదుర్రు గ్రామాలకు చెందిన రైతులు జి. సత్యనారాయణ, కె. వెంకట్రావు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సర్వే జరిపి తమకు నష్టపరిహారం అందజేయాలని వారంతా వేడుకుంటున్నారు.

సీసీ డ్రైన్ పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ పోసిరాజు, తదితరులు

తాళ్లపూడి, మే 16 (ఆంధ్రజ్యోతి): పెద్దేవంలో అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ డ్రైన్ నిర్మాణానికి సంబంధించి శుక్రవారం ఎంపీపీ జొన్న కూటి పోసిరాజు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉపసర్పంచ్ తోట రామకృష్ణ మాట్లాడుతూ గ్రామంలోని వీధులను విస్తరించి రోడ్లను, డ్రైన్లను ప్రణాళికాబద్ధంగా నిర్మించడం జరుగుతుందన్నారు.ఇందులో భాగంగా నేడు రూ.10 లక్షల నిధులతో చేపట్టిన సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశామన్నారు. కార్యక్రమంలో కోడి గంగారావు, బోడపాటి శ్రీను, ఇంటి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం... ఒకరి అరెస్టు

దేవరపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో సారా స్థావరాలపై శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇందులో చుక్కా సుబ్బారావు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ బల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోమటిగుంటలో సారా తయారు చేయడానికి సుబ్బారావు అనే వ్యక్తి వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ఉంచాడని, దాన్ని గుర్తించి ధ్వంసం చేయడం జరిగిందని తెలిపారు. అలాగే గోపాలపురంలో సారా అమ్ముతున్న గుబ్బల శ్రీను అనే వ్యక్తిని కూడా అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు.

డెంగీపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరం



వేలివెన్నులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



తాళ్లపూడి: ర్యాలీలో ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది



గౌరీపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ఉండ్రాజవరం, మే 16 (ఆంధ్రజ్యోతి): డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన అవసరమని ఉండ్రాజవరం, వేలివెన్ను పీహెచ్‌సీ డాక్టర్లు ఆర్. ప్రసాద్, ఇర్ఫాన్ అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ఉండ్రాజవరం, వేలివెన్నులో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వ్యాధి దోమల వల్ల వస్తుందన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగు కుంటలు లేకుండా చూసు కోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్రుజన, పీహెచ్ఎన్ కె. కుమారి, సూపర్‌వైజర్ కె. సుభాషిణి, ఏఎన్ఎంలు సునీత, పర్విన్, భాగ్యలక్ష్మి, మహాలక్ష్మి, సత్యవతి, వెంకటలక్ష్మి, అన్నపూర్ణ, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి వైద్యాధికారి హరికాగుప్త ఆధ్వ ర్యంలో శుక్రవారం జాతీయ డెం గీ నివారణ దినోత్సవాన్ని నిర్వ హించారు. ఈసందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పగలు కుట్టే దోమతోనే డెంగీ వస్తుందని, దీనిపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే పరిసర ప్రాంతాల్లో దోమలు పెరగకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం వైద్యసిబ్బందితో భారీ ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లి: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గౌరీపట్నంలో వైద్యాధికారులు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి సతీశ్ మాట్లాడుతూ ఈ వ్యాధి ఎడిస్ ఈజిప్టి (టైగర్‌దోమ) వల్ల వస్తుందన్నారు. పగటిపూటి ఇవి కుడతాయన్నారు. అందువల్ల తినిపారేసిన కొబ్బరిబొండాలు, వాడిపారేసిన ప్లాస్టిక్ సామాన్లు, తదితర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. హెచ్‌వో శ్రీకృష్ణుడు, హెల్త్‌సూపర్‌వైజర్ అశోక్‌వర్ధన్, వైద్యాధికారులు ఎస్ఎస్‌వీ సత్యనారాయణ, సీహెచ్.రాజు, సుకు మార్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

'పేదలకు మెరుగైన సేవలందించాలి'



నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ పద్మ

నిడదవోలు, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందాలని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సర్వీసెస్ సమన్వయకర్త డాక్టర్ పద్మ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (ప్రభుత్వ ఆసుపత్రి)ని సందర్శించారు. ఈ సందర్భంగా ఓపీ, ఆపరేషన్ థియేటర్, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఆమె వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫయాజ్, రవికాంత్, సుష్మరాణి, రెహనా, అబ్బాస్, తదితరులు ఉన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ



క్యాబిన్‌లోకి దూసుకెళ్లిన ఇనుప ఊచలు

దేవరపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఇనుప ఊచల లోడుతో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టిన ఘటన గౌరీపట్నం శివారులో శుక్రవారం జరిగింది. రాజమండ్రి నుంచి దేవరపల్లి వైపు వస్తున్న ఐరెన్ ఊచల లారీ సాంకేతిక లోపం కారణంగా నిలిచిపోయింది. అయితే అదే మార్గంలో రాజమండ్రి వైపు వస్తున్న మరో లారీ ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన క్లీనర్‌ను గోపాలపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి



కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి అనురాధ

కొవ్వూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జూలై 5వ తేదీన కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్టు కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ తెలిపారు. ఇందులో సివిల్, క్రిమినల్, కుటుంబ తగాదాల కేసులు, భార్యాభర్తల భరణం, డొమస్టిక్ వయోలెన్స్‌కేసులు, మోటారు వాహన ప్రమాద కేసులు, బ్యాంకు బకాయిలు, ప్రీ లిటిగేషన్, టెలిఫోన్ బకాయిలు, ప్రామిసరీ నోట్ కేసులు రాజీ చేసుకోవచ్చునన్నారు. న్యాయవాదులు, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దారవరం రైల్వేగేటు మూసివేత



మూసివేసి ఉన్న గేటు

చాగల్లు, మే 16 (ఆంధ్రజ్యోతి): దారవరం రైల్వేగేటును శుక్రవారం నుంచి వారం రోజుల పాటు మూసివేస్తున్నట్టు రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే గేటు, పట్టాల మరమ్మతుల నిమిత్తం గేటును ఈనెల 25వ తేదీ వరకు తెరుచుకోదని చెప్పారు. దారవరం, మల్లవరం, చంద్రవరం, మార్కొండపాడు, తదితర గ్రామాల ప్రజలు సహకరించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మెకానిక్ మృతి



మృతిచెందిన నాగరాజు (ఫైల్)

కొవ్వూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బైక్ మెకానిక్ మృతిచెందినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వివరాలివి... పట్టణానికి చెందిన పత్తిగుళ్ల నాగరాజు పట్టణంలోని ఓ హోండా షోరూంలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 15వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి బయటకు వస్తుండగా, కొవ్వూరు డిపోకు చెందిన బస్సు ఢీకొట్టడంతో తీవ్ర రక్తస్రావమై అక్క డికక్కడే మృతిచెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని వద్ద లభించిన ఫోన్‌నెంబర్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య దేవి, కుమారుడు సాయిరామ్, కుమార్తె యమున స్వప్నమాధురి ఉన్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ జీజీ ప్రకాష్ కేసు నమోదు చేశారు.

గోదావరిలో యువకుడి గల్లంతు



జగపతిబాబు (ఫైల్)

ఆత్రేయపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): గౌతమి గోదావరి నదీలో ప్రమాదవశాత్తు ఒక యువకుడు గల్లంతయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉండ్రాజవరానికి చెందిన 20 ఏళ్ళ యువకుడు తలపాకుల జగపతిబాబు(జోని) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఆత్రేయపురం ఉల్లిపేటలో తన మేనమేమ కుమారుడు పుట్టిన రోజు వేడుకలకు శుక్రవారం వచ్చాడు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం రెండు గంటల సమయంలో గౌతమీ నదీ తీరానికి బహిర్భూమికి వచ్చాడు. ప్రమాదవశాత్తూ కాలుజారి గోదావరిలో గల్లంతయ్యాడు. స్థానికులు గోదావరిలో పడవల ద్వారా గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఆచూకీ లభ్యంకాలేదు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మేనమామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

ప్రజాసమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యం

రాజమహేంద్రవరం సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో తన చాంబర్‌లో అన్ని విభాగాల ప్రధాన అధికారులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ గత వారం రోజులుగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై తీసుకున్న చర్యలకు సంబంధించిన రిపోర్టును సిద్ధం చేయాలన్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీసి రానున్న వర్షాకాలం నేపథ్యంలో పనులు వేగంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా బీట్ ద హీట్ కార్యక్రమంపైన, వడగాల్పుల బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలను ప్రజలందరికీ వివరించాలన్నారు. శనివారం జరి గే తిరంగ్ ర్యాలీలో పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొనేలా అవకాశం ఉన్నందున తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.